

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోండి

● కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మే 3: జిల్లాలో ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించే పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటరుగా నమోదై ఎన్నికల విధుల్లో పాల్గొంటూ దరఖాస్తు చేసుకున్న వారందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటరుగా నమోదై ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొంటున్న ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు, అంగన్వాడీలు, రాయచోటిలో నేతాజి సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా ఫెసిలిటేషన్ కేంద్రంలో ఈనెల 5న పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో పనిచేస్తూ ఈ జిల్లాలోనే ఓటరుగా నమోదై ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పోలీసులు, ఆర్టీసీ డ్రైవర్లు, క్లీనర్లు, బీఎల్‌వోలు, సెక్టోరల్ అధికారులు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు, అత్యవసర సేవల ఓటర్లు, వీడియో పర్సన్స్, ఎన్నికల విధుల్లో నియమితమైన వీడియో గ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లు, ఎన్నికల నిర్వహణలో ఉన్న ఇతర అధికారులు అందరూ రాయచోటి నేతాజీ సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా ఫెసిలిటేషన్ కేంద్రంలో ఈనెల 5న పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలన్నారు. నేటి నుంచి 8వ తేదీ వరకు జిల్లాలో 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, పీడబ్ల్యుడీ ఓటర్లకు హోం ఓటింగ్ నిర్వహిస్తారు.

పోస్టల్ బ్యాలెట్‌కు తీసుకురావాల్సిన పత్రాలు

- ఎన్నికల విధుల అపాయింట్‌మెంట్ ఆర్డర్
- ఓటరు ఐడీ కార్డు
- ఆధార్‌కార్డు
- ఎంప్లాయ్ ఐడీ కార్డు

నియోజకవర్గాల్లోని ఫెసిలిటేషన్ కేంద్రాలు

- 125- రాజంపేట: గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, కూచివారిపల్లె, రాజంపేట
- 127- రైల్వేకోడూరు (ఎస్సీ): హెచ్ఎం హైస్కూల్, తహసీల్దార్ కార్యాలయం పక్కన, కోడూరు
- 128- రాయచోటి: గవర్నమెంట్ హైస్కూల్ డైట్, ఆర్టీసీ బస్టాండు దగ్గర, రాయచోటి
- 162-తంబళ్లపల్లె: జిల్లా పరిషత్ హైస్కూల్, అంగళ్లు, కురబలకోట మండలం
- 163- పీలేరు: గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, పీలేరు
- 164-మదనపల్లె: బీటీ గవర్నమెంట్ కాలేజ్, మదనపల్లె

అధికార పార్టీ అరాచకాలపై.. ఎన్నికల సంఘం కొరడా..

- రాష్ట్రంలో 14 నియోజకవర్గాల్లో ప్రత్యేక చర్యలు
- అందులో నాలుగు రాజంపేట పార్లమెంట్ పరిధిలోనే..
- వంద శాతం వెబ్‌కాస్టింగ్
- సీఏపీఎఫ్ బలగాలతో భద్రత కట్టుదిట్టం
- ప్రశాంత ఎన్నికల కోసం ఎన్నికల సంఘం నిర్ణయం



అంగళ్లులో వైసీపీ మూక రాళ్ల దాడి నుంచి చంద్రబాబుకు రక్షణ కల్పిస్తున్న భద్రతా సిబ్బంది (ఫైల్)

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ అరాచకాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. గతంలోనూ.. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు, రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ఇచ్చిన నివేదికల ప్రకారం.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 14 నియోజకవర్గాలలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్‌లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. ప్రత్యేక చర్యల్లో భాగంగా ఎన్నికల రోజు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో వందశాతం వెబ్‌కాస్టింగ్‌తో పాటు సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్‌తో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా పల్నాడు, ప్రకాశం, నంద్యాల, తిరుపతి, ఎన్టీఆర్ కృష్ణా, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. రాష్ట్ర వ్యాప్తంగా 14 నియోజకవర్గాలు ఉండగా అందులో నాలుగు రాజంపేట పార్లమెంటు పరిధిలోనే ఉండడం గమనార్హం. అన్నమయ్య జిల్లాలో పుంగనూరు, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి నియోజకవర్గాలు ఉన్నాయి. రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ఇచ్చిన నివేదిక, గతంలో, ఇటీవల పై నియోజకవర్గాలలో కొన్ని ఓటర్లను భయపట్టే, ప్రభావితం చేసే సంఘటనలు జరిగాయి. వీటన్నింటి పైన రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు రాష్ట్ర ఎన్నికల సంఘానికి పూర్తి స్థాయిలో నివేదికలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

లెక్కకు మించి హింసాత్మక సంఘటనలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజంపేట పార్లమెంటు పరిధిలో పలు నియోజకవర్గాలలో అధికార పార్టీ అరాచకాలకు అంతే లేకుండా పోయింది. ముఖ్యంగా రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సామ్రాజ్యంగా పిలవబడే పుంగనూరు నియోజకవర్గంలో ప్రతిపక్ష నాయకులపై అనేక దాడులు జరిగాయి. పోలీసులను అడ్డం పెట్టుకుని వందలాది మంది ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారు. పుంగనూరు పర్యటనకు వెళ్లిన ప్రతిపక్ష నేత చంద్రబాబుపైనే అధికార పార్టీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. రాళ్ల దాడులకు పాల్పడ్డారు. చంద్రబాబుతో సహా పలువురు ముఖ్యనాయకులపై హత్యాయత్నాం వంటి అక్రమ కేసులు పదుల సంఖ్యలో బనాయించారు. భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్రాయాదవ్‌పైన అనేక మార్లు అధికార పార్టీ నాయకులు దౌర్జన్యాలకు దిగారు. అతడి ఇంటి పైన దాడికి పాల్పడి విధ్వంసం సృష్టించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి గ్రామాలలో పర్యటించకుండా దాడులకు దిగారు. వారం రోజుల కిందట భారత చైతన్య యువజన పార్టీకి చెందిన 10 ప్రచార వాహనాలను పోలీసుస్టేషన్ ఎదుటే దాడి చేసి ధ్వంసం చేశారు. ఒకమాటలో చెప్పాలంటే.. ప్రతిపక్ష పార్టీలకు ఇక్కడ ప్రవేశం లేదనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి పోలీసులు అధికార పార్టీకి ఏకపక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దాడులకు అధికార పార్టీ నాయకులు పాల్పడినా.. దెబ్బలు తిన్న ప్రతిపక్ష పార్టీలపైనే పోలీసులు తీవ్రమైన ఆరోపణలతో కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్రను అధికార పార్టీ అడుగడుగునా అడ్డుకుంది. ఇందుకు పోలీసులు పూర్తి స్థాయిలో సహకరించారు.

● పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తమ్ముడు ద్వారకనాథరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తంబళ్లపల్లె నియోజకవర్గంలోనూ ఇదే స్థాయిలో అధికార పార్టీ అరాచకాలకు పాల్పడుతోంది. ప్రతిపక్షాలపై దాడులు, పోలీసు కేసులతో విరుచుకుపడుతోంది. గత ఏడాది ఆగస్టులో అంగళ్లలో చంద్రబాబునాయుడుపైన అధికార పార్టీ నాయకులు రాళ్ల దాడులకు పాల్పడ్డారు. టీడీపీ నాయకులకు చెందిన వాహనాలను ధ్వంసం చేశారు. అధికార పార్టీ చేతిలో దాడికి గురైన వాళ్లపైనే హత్యాయత్నంతో పాటు అనేక సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నాయకులు సుమారు 650 మందిపైన కేసులు బనాయించారు. సుమారు 45 రోజుల పాటు ఈ నాయకులు అందరూ అజ్ఞాతంలోకి వెళ్లిపోవాల్సి వచ్చింది. తర్వాత హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో గ్రామాల్లోకి వచ్చారు. ఈ నియోజకవర్గంలో సైతం ప్రతిపక్షాలు స్వేచ్ఛగా తమ రాజకీయ కార్యకలాపాలు నిర్వహించుకునే పరిస్థితి లేదు.

● మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పుచేతల్లో ఉన్న పీలేరు నియోజకవర్గంలో సైతం ప్రతిపక్షాలకు కనీస స్వేచ్ఛలేదు. నారా లోకేశ్ యువగళం పాదయాత్రలోనూ పోలీసులు అనేక ఆంక్షలు విధించారు. ప్రభుత్వంపైన ప్రతిపక్షాలు చిన్నపాటి విమర్శలు కూడా చేయలేని పరిస్థితులు ఉన్నాయి. గత వారంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రచార రథానికి అధికార పార్టీ నాయకులు నిప్పు పెట్టారు. ఇప్పటికి ఇంకా నిందితులను అరెస్టు చేయలేదు

● రాయచోటి నియోజకవర్గంలోనూ అధికార పార్టీ అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అధికార పార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలు, అన్యాయాలను ప్రశ్నిస్తున్న వారిపైన పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఇక్కడ అనేక పోలింగ్ కేంద్రాలలో అధికార పార్టీ తమను కనీసం ఓటింగ్‌కు కూడా రాకుండా చేసే అవకాశం ఉందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

రంగంలోకి కేంద్ర బలగాలు

స్థానికంగా ఉన్న పోలీసులు పూర్తి స్థాయిలో అధికార పార్టీ కనుసన్నల్లో ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది పోలీసు అధికారులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కంటే.. దారుణంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ ఎన్ని అరాచకాలకు పాల్పడుతున్నా.. వాళ్లపైన ఎటువంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో స్థానిక పోలీసులు పూర్తిగా అధికార పార్టీకి సహకరిస్తారని ప్రతిపక్షాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం పై నియోజకవర్గాలలో పెద్ద సంఖ్యలో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సును (సీఏపీఎఫ్) వినియోగించాలని జిల్లా ఎస్పీలను ఆదేశించింది. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితులు కల్పించాలని ఆదేశించింది. ఎన్నికల సంఘం చొరవతో అయినా.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతాయో? లేదో? వేచి చూడాలి.

వంద శాతం వెబ్‌కాస్టింగ్..

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆయా జిల్లా కలెక్టర్లకు ఇచ్చిన ఆదేశాల ప్రకారం పైనే పేర్కొన్న రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాలలో అన్ని పోలింగ్ కేంద్రాలలో వంద శాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలి. పోలింగ్ కేంద్రంలో జరిగే ఓటింగ్ ప్రక్రియ లైవ్‌లో ఉంచాలి. ఇప్పటికి స్థానిక అధికారుల నివేదిక ప్రకారం.. పుంగనూరు నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అందులో 189 కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ చేయాలి. తంబళ్లపల్లెలో 236 పోలింగ్ కేంద్రాలలో 65 సమస్యాత్మకంగా ఉన్నాయి. పీలేరులో 281 పోలింగ్ కేంద్రాలలో 76 సమస్యాత్మకంగా ఉన్నాయి. రాయచోటి నియోజకవర్గంలో 292 పోలింగ్ కేంద్రాలలో 84 సమస్యాత్మకంగా ఉన్నాయి. ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు.. ఈ నియోజకవర్గాలలో అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింట్ లైవ్ పెట్టాలి.



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంతూరు సదుం మండలం యర్రాతివారిపల్లెలో పోలీసుల ఎదుటే రామచంద్ర యాదవ్ అనుచరులపై దాడి చేస్తున్న దృశ్యం (ఫైల్)

పుంగనూరులో బీసీవైపీ ప్రచార రథాలను ధ్వంసం చేస్తున్న దృశ్యం (ఫైల్)



మోదీ పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

● హెలీప్యాడ్‌ల స్థలాలను పరిశీలించిన డీఐజీ

కలికిరి, మే 3: కలికిరి సమీపంలోని నగరిపల్లె సీఆర్పీఎఫ్ శిక్షణ శాల ప్రధాన ద్వారం సమీపంలో జరగనున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. సైనిక్ స్కూల్ వెనుక వైపు హెలీప్యాడ్‌ల ఏర్పాటుకు తలపెట్టిన ఒక ప్రైవేటు పొలాన్ని పరిశీలించారు. ఈ సమావేశంలో మోదీతో పాటు చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురంధేశ్వరి తదితరులు పాల్గొంటున్నందున అవసరమైన హెలీప్యాడ్‌లను సిద్ధం చేయడానికి జరుగుతున్న పనులను కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదార్ల నుంచి ఇటు హెలీప్యాడ్‌లు, అటు సభా ప్రాంగణాన్ని కలిపే రహదార్ల గురించి ఎస్పీ కృష్ణారావుకు పలు సూచనలు చేశారు. ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని డీఐజీ ఆదేశించారు. అనంతరం సభా స్థలాన్ని, ఏర్పాట్లను కూడా డీఐజీ పరిశీలించారు. జిల్లా నలువైపుల నుంచి వచ్చే వాహనాల క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ మళ్లింపు, వీఐపీల పటిష్ట భద్రతల గురించి చర్చించారు. ప్రధాని భద్రతా విభాగాన్ని సమన్వయం చేసుకునే విషయంలో పలు సూచనలు చేశారు. బందోబస్తు విధులకు హాజరయ్యే సిబ్బంది విధుల్లో వ్యవహరించాల్సిన తీరుతెన్నుల గురించి వివరించారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రధాని సభ విజయవంతంగా ముగిసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనధికారికంగా డ్రోన్లు ప్రయోగించకుండా నియంత్రించాలన్నారు. అలాంటి డ్రోన్లపై నిఘా ఉంచాలన్నారు. హెలీప్యాడ్‌ల వద్ద బ్యారికేడింగ్, అంబులెన్స్, అగ్నిమాపక యంత్రాలను సిద్ధం చేయాలన్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించి భద్రత, రవాణా, వసతి, వైద్య సదుపాయాలపై కూడా దృష్టి సారించాలన్నారు. అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, డీఎస్పీ మహబూబ్ బాషా, ఎస్బీ సీఐ సత్యనారాయణ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీఐజీ విజయరావు, ఎస్పీ కృష్ణారావు

అక్రమ మద్యంపై సమాచారం ఇవ్వండి

● జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినయ్‌బాబు



రాయచోటి టౌన్, మే 3: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అక్రమ మద్యం, నాటు సారా తయారీ విక్రయాలపై సమాచారం అందించి ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినయ్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మద్యం నిషేధంతో పాటు నాటుసారా తయారీ, విక్రయాలు, అక్రమ మద్యం నిల్వలపై సమాచారం కోసం జిల్లా కేంద్రంలోని అబ్కారీ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా మద్యం నిల్వలు ఉన్నట్లు తెలిస్తే వెంటనే 8106843571, 8247049853 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే ముందస్తు జాగ్రత్త చర్యలుగా జిల్లా పరిధిలోని మదనపల్లెలో ఉన్న మద్యం డిపో వద్ద 16 క్లోజ్ సర్క్యూట్ కెమెరాలు, నాలుగు ఐపీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. సరుకును సరఫరా చేసే 7 వాహనాలను కూడా జీపీఎస్ ట్యాగింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, 12 బార్లలో కూడా క్లోజ్ సర్క్యూట్ కెమెరాలను బిగించి జిల్లా ఎన్నికల అధికారి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు, మద్య నిషేధ అబ్కారీ కమిషనర్ కార్యాలయ కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసి మద్యం విక్రయాలపై నిరంతర నిఘా ఉంచినట్లు ఆయన తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుండి సుంకం చెల్లించకుండా సరఫరా అయ్యే అక్రమ మద్యంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి నిఘా ఉంచామన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది అక్రమాలకు పాల్పడితే వారిని విధుల నుంచి తొలగించడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్కడ మోదీ.. ఇక్కడ చంద్రబాబు గెలుపు ఖాయం

- మోదీ కలికిరి సభ చరిత్రాత్మకమవుతుంది
- మైనారిటీలు మోసపోవద్దు.. విజ్ఞతతో ఆలోచించండి
- మాజీ సీఎం, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

కలికిరి, మే 3: ఢిల్లీలో మోదీ ప్రధాని కావడం, రాష్ట్రంలో చంద్రబాబు సీఎం కావడం ఖాయం. ఈ గెలుపుతో నియోజకవర్గం మరోసారి అభివృద్ధితో పరుగులు పెడుతుంది. కలికిరిలో జరిగే మోదీ బహిరంగసభ చరిత్రాత్మకమవుతుంది. బీజేపీ మైనారిటీలకు వ్యతిరేకమనే దుష్ప్రచారాన్ని నమ్మవద్దు. వారికి అండగా నేనుంటానని మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన స్వగ్రామం నగరిపల్లెలో జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ మొదటిసారిగా పీలేరు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు అమర్చుతున్నారని, పోలింగ్ జరుగుతున్న తీరును ఎవరైనా కెమెరాలకు లాగిన్ అయి వీక్షించవచ్చునని చెప్పారు. ముస్లింలకు మోదీ వ్యతిరేకమనే ప్రచారాన్ని కూడా ఆయన తోసి పుచ్చుతూ ప్రపంచంలోని ఆరు ప్రధానమైన అరబ్ దేశాలు విడివిడిగా ఆయా దేశాల అత్యున్నత పురస్కారాలను మోదీకి అందజేసి గౌరవించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇక్కడ జరిగే మోదీ సభతోనే ఎన్నికల ఫలితం తేలిపోవాలని కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఇందిరాగాంధీ అనంతరం 42 ఏళ్ల తరువాత మరో ప్రధాని నరేంద్ర మోదీ మన గ్రామానికి వస్తున్నారు. అంటే నియోజకవర్గం రూపురేఖలు సమూలంగా మారడానికి ఇదే సంకేతమని తెలిపారు. సమావేశంలో పీలేరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, నల్లారి చంద్రకుమార్ రెడ్డి, లక్ష్మీకర్ రెడ్డి, అమరనాథ రెడ్డి, నిఖిలేష్ రెడ్డి, ముస్లిం నాయకులు వేంపల్లె అబ్దుల్ ఖాదర్, రహంతుల్లా, నిజాముద్దీన్, వైజాగ్ బాషా, మార్కెట్ అల్లాబక్ష, జనసేన ఇన్‌చార్జి బెజవాడ దినేష్, అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ సభా ప్రాంగణానికి భూమి పూజ

ఈనెల 8న నగరిపల్లె సమీపంలో జరగనున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభా ప్రాంగణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. మాజీ సీఎం, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిలు ఈ భూమి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా సభా ప్రాంగణంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. శుక్రవారం ప్రధాన వేదిక నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు వంద ఎకరాల్లో మోదీ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కూటమి గెలుపు.. ప్రగతికి మలుపు..

● విస్తృతంగా టీడీపీ, బీజేపీ, జనసేన నేతల ప్రచారం

చిట్వేలి మే 3: కూటమి గెలుపు రాష్ట్ర ప్రగతికి మలుపు అని ముక్కా రూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మి, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెంగల్ రాజు, జనసేన రాయలసీమ జోన్ కన్వీనర్ జోగినేని మణి, ముక్కా సాయి వికాష్ రెడ్డి కోడలు ముక్కా శిరీష అన్నారు. తిమ్మాయపాలెం పంచాయతీ గట్టుమీదపల్లిలో శుక్రవారం ఉదయం మండల టీడీపీ అధ్యక్షుడు కేకే చౌదరి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి గాజు గ్లాసు, కమలం గుర్తులకు ఓటు వేయాలని కోరారు. జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో జనసేన రాయలసీమ కో కన్వీనర్ రాందాస్ చౌదరి, మాజీ సర్పంచ్ రమణయ్య, కాకర్ల నాగార్జున, బాలు రెడ్డయ్య, గుత్తి నరసింహ, నాన బాల నాగార్జున, బాలకృష్ణ యాదవ్, పెంచల్‌రెడ్డి, కరీం, మన్మథ, పగడాల శివ, పవన్ రాజు, శ్రీధర్, కొనిలిశెట్టి, సుబ్బరాయుడు, రంగయ్య యాదవ్, జనసేన ఎన్ఆర్ఐ పురం సురేష్, చిరంజీవి, ప్రకాష్, సుబ్రహ్మణ్యం, నరసింహ , టీడీపీ జనసేన బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనంతంపల్లెలో ఇంటింటి ప్రచారం

పెనగలూరు: మండలంలోని అనంతంపల్లె, పాటివారిపల్లె, వెంకటనారాయణపల్లి, పాతపల్లి, పేరంవారిపల్లెలో శుక్రవారం జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి ఇంటింటి ప్రచారం చేశారు. ముక్కా రిషికా రెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి దామోదర్ నాయుడు, మండల కార్యదర్శి కళా చంద్ర, ధనుంజయనాయుడు, నరేష్ బాబు, మాజీ సర్పంచ్ శంకరయ్య, మాజీ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సి.ధనుంజయనాయుడు, మండల జనసేన అధ్యక్షుడు గోబురు హరిరాయల్, బీజేపీ అధ్యక్షులు హరి ప్రసాద్ రాయల్, మాజీ అధ్యక్షుడు మణ్యం మల్లికార్జున పాల్గొన్నారు.

పేరంవారిపల్లెలో ఘనస్వాగతం..

మండలంలోని పేరంవారిపల్లిలో ముక్కా రూపానంద రెడ్డి, తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్, పారిశ్రామికవేత్త పేరం కృష్ణయ్య నాయుడుకు దాసరి దామోదర్ నాయుడు, బాబు నాయుడు టీడీపీ జిల్లా కార్యదర్శి సుధర్శన్ నాయుడు ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికారు. శాప్ మాజీ డైరెక్టర్ జయచంద్ర, టీడీపీ నాయకురాలు అనితా దీప్తి, అనంతంపల్లి ఎంపీటీసీ సభ్యుడు జగదీష్, సర్పంచ్ రామ్మోహన్ నాయుడు, రాజంపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చెనిగిలపాటి చంద్రమోహన్ ,మాజీ సర్పంచ్ ముక్కర శంకరయ్య, కే.కళాచంద్ర, కాకర్ల సుబ్బరాయుడు నాయుడు, మన్నూరు సత్యనారాయణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: మండలంలోని బావికాడపల్లి గ్రామ పంచాయతీలో టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు నాయకత్వంలో టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అరవ శ్రీధర్ గెలుపు కోసం ముక్కా చిన్న కొడలు ముక్కా శిరీష ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరులో ఉమ్మడి జనసేన అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారని ప్రజలన నుంచి విశేష స్పందని వస్తోందని ఆమె తెలిపారు. గ్లాసు గుర్తుకు ఓటు వేసి గెలిపించి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం మండలంలోని తిప్పాయపల్లెలో నాగలక్క గారి కృష్ణారెడ్డి, టీ. భార్గవ్, వై.అంజి రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నేలపాటి రామచంద్రనాయుడు మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, ఉపాధక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, యూనిట్ ఇన్‌చార్జ్ చుండు ఈశ్వర్ నాయుడు, ఎన్ఆర్ఐ టీడీపీ ప్రధాన కార్యదర్శి మారోతు మల్లి, పద్మాకర్ రెడ్డి, లాయర్ హనుమంత నాయుడు, కర్ణం రాజా నాయుడు, కృష్ణమ నాయుడు, విజయ్ కుమార్ చౌదరి, బీజేపీ నాయకులు పోతుగుంట రమేష్, గండికోట రామకృష్ణ, బీసీ నాయకులు వెంకటరమణ, మణి, కొండేటి చెంగయ్య, వెంకటరాయుడు, కుప్పాల రామక్రిష్ణ, మల్లి తదితరులు పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ కరపత్రాలను పంచి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అరవ శ్రీధర్



రైల్వేకోడూరు: యువతతో మాట్లాడుతున్న ముక్కా రూపానందరెడ్డి

ఎన్నికల్లో యువత పాత్ర కీలకం

రైల్వేకోడూరు: ఎన్నికల్లో యువత పాత్ర కీలకమని టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు విజయ కన్వెన్షన్ హాలులో బూత్ లెవల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో బూత్ లెవెల్‌లో ఎక్కువగా యువతే పని చేస్తున్నారన్నారు. 13 తేదీన నిర్వహించే సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని యువకులు పాల్గొన్నారు.



పుల్లంపేటలో ప్రచారంచేస్తున్న కూటమి నాయకులు



బ్యాలెట్ నమూనా పత్రాలను చూపిస్తున్న కూటమి నాయకులు



పేరంవారిపల్లెలో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

'కొరముట్లకు ఓటు అడిగే హక్కులేదు'



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర

రైల్వేకోడూరు, మే 3: ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుకు ఓటు అడిగే హక్కు లేదని రాష్ట్ర జనసేన పార్టీ కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తెలిపారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సొంతూరికి లైటు కూడా వేయించుకోలేని ఆయనకు ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభివృద్ధి చేసి ఉంటే ఓట్లు వేయమని చెబుతున్నారని, రైల్వేకోడూరులో ఎమ్మెల్యే కొరముట్ల అభివృద్ధి చేయలేదు కాబట్టి ప్రజల్ని ఓట్లు అడిగేందుకు వీలు లేదన్నారు. బలిజవీధిలోని ఎస్సీ హాస్టల్ లో చదువుకున్నప్పటి సమస్యలు.. ఆయన ఎమ్మెల్యే అయి 16 ఏళ్లు దాటినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఎమ్మెల్యే తన సొంతూరికి బ్రిడ్జి కూడా పూర్తి చేయలేదన్నారు. రెడ్డివారిపల్లెలో డ్రైనేజి కూడా ఏర్పాటు చేయలేదన్నారు. చిట్వేలి-కోడూరు డబుల్ రోడ్డు, గుంజననది, సోమశిల బ్యాక్‌వాటర్, రైల్వే అండర్ బ్రిడ్జిలకు భూమి పూజ చేసి వదిలేశారన్నారు. ఏనాడైనా అసెంబ్లీలో కోడూరు సమస్యలపై చర్చించారా అని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్‌లో రైల్వేకోడూరుకు ఎన్ని నిధులు కేటాయించారని ప్రశ్నించారు. అప్పా జ్యూస్ పరిశ్రమ మూత పడి రెండు దశాబ్దాలైనా ఇంత వరకు పునఃప్రారంభానికి నోచుకోలేదన్నారు. మంగంపేట బెరైటీస్ టోపీడీపై మాట్లాడలేదన్నారు. రైల్వే కోడూరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎందుకు ఏర్పాటు చేయలేదన్నారు. వైఎస్ విజయమ్మ, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి లెటర్లు తెచ్చిన వారికి మంగంపేటలో ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను మోసం చేశారన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ విజన్ కల్గిన నాయకులన్నారు. పవన్‌కళ్యాణ్ కౌలు రైతులకు రూ. 30 కోట్లు ఇచ్చాడన్నారు. రాజంపేటకు అన్ని వనరులు ఉన్నా జిల్లా కేంద్రం చేయలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి అభివృద్ధి చేయకుంటే చొక్కా పట్టుకుని ప్రజలు నిలదీయవచ్చునన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి సంపాదనే ధ్యేయంగా పనులు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి గడ్డం చంగల్‌రాజు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాన్‌స్టాప్ బెట్టింగ్, రాష్ట్రం లూటీ, సీఎం 420 అని ఆరోపించారు. కేంద్రం నిధులు కేటాయిస్తే దుర్వినియోగం చేశారన్నారు. గతంలో మద్యం బాటిల్ రూ. 60 ఉంటే దాన్ని రూ. 200లు చేశారన్నారు. 16 ఏళ్లుగా రైల్వేకోడూరులో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలకు తెలుసునన్నారు. రైల్వేకోడూరులో వైసీపీ గెలుస్తుందని భ్రమలో ఉన్నారన్నారు. ఈ నెల 13న ఓటు అనే ఆయుధంతో వైసీపీని ఇంటికి పంపిస్తారని తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు నార్జాల హేమరాజ్ మాట్లాడుతూ రైల్వేకోడూరును అభివృద్ధి చేయకుండా చేశామని డప్పుకొట్టుకుంటున్నారని తెలిపారు. పంచాయతీ నిధులు ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. రైల్వేకోడూరు జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్, రాజంపేట పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ యువ నాయకులు పోతురాజు నవీన్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ వర్మ, జనసేన సీనియర్ నాయకులు జోగినేని మణి, పగడాల వెంకటేష్, పగడాల చంద్రశేఖర్, వరికూటి నాగరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కొమ్మా శివ, జనసేన నాయకులు కొక్కంటి మహేష్ తదితర నాయకులు పాల్గొన్నారు

మద్యం నియంత్రణకు చర్యలు



మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ శాఖ నోడల్ అధికారి చంద్రానాయక్

రైల్వేకోడూరు, మే 3: మద్యం నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎక్సైజ్‌శాఖ నోడల్ అధికారి చంద్రానాయక్ తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని వై.కోట, నాగవరం, రైల్వేకోడూరుల్లో ఉన్న మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణ నిర్వాహకులు ఎన్నికల నియమావళి పాటిస్తున్నారా లేదా అన్న విషయాలపై రికార్డులు పరిశీలిస్తున్నామని తెలిపారు. మద్యం దుకాణాల్లో చట్టాన్ని అతి క్రమించి పని చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం దుకాణాల్లో చిన్న పొరపాట్లు కూడా జరగకుండా సిబ్బంది చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జయసింహ, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ గాయత్రి, హేమంత్‌కుమార్, సుధాకర్, విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో పోలీసు కవాతు

నందలూరు, మే 3: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామని, ప్రజలందరూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. శుక్రవారం కేంద్ర బలగాలతో స్థానిక పోలీస్‌స్టేషన్ నుండి నందలూరు గ్రామ పంచాయతీలోని సౌమ్యనాధస్వామి ఆలయం వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేలా ప్రజలకు భద్రత కల్పించడానికి ఈ పోలీసు కవాతు నిర్వహించినట్లు తెలియజేశారు. ఎన్నికల సమయంలో అల్లర్లకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు, కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి సహకరించాలని ప్రజలను కోరారు.

'ఓటును తాకట్టు పెట్టొద్దు'

రాయచోటిటౌన్, మే 3: కరెన్సీ నోటు కోసం ఓటును తాకట్టు పెట్టి రాష్ట్ర, దేశ భవిష్యత్తును అంధకారం చేయవద్దని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) అన్నమయ్య జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేశ్ అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య 65వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన ఓటు హక్కును నేడు కొందరు కరెన్సీ నోటు కోసం తాకట్టు పెట్టడం చాలా బాధాకరమన్నారు. యువతీ, యువకులు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకొని నిజాయతీపరులకు మాత్రమే ఓటు వేయాలని ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. ఏఐవైఎఫ్ నాయకులు లోకేశ్వర్, మహేంద్ర, అమరేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియుల ఆత్మీయ సమావేశం



క్షత్రియ ఆత్మీయ సమావేశం లో మాట్లాడుతున్న గడ్డం చంగల్‌రాజు

రైల్వేకోడూరు, మే 3: ఎన్‌డీఏ అభ్యర్థుల విజయం కోసం శుక్రవారం రైల్వేకోడూరు పట్టణంలోని బాలాజీ కల్యాణ మండపంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం చంగల్ రాజు ఆధ్వర్యంలో క్షత్రియ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి మండలాల్లో ఉన్న క్షత్రియులు అందరూ కలసికట్టుగా ఎన్‌డీఏ కూటమికి మద్దతుగా పని చేస్తున్నారని తెలిపారు. రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్‌లను గెలిపించడానికి క్షత్రియులు నడుం బిగించాలన్నారు. రైల్వేకోడూరు క్షత్రియ నాయకులు దాసరాజు జయప్రకాష్‌నారాయణవర్మ, జి. వెంకటేశ్వర్ రాజు, సంగరాజు రవికుమార్‌రాజుపాల్గొన్నారు.

చంద్రన్నతోనే రాష్ట్రంలో సుపరిపాలన

●టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్ రెడ్డి



ఇంటింటి ప్రచారంలో మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, మే 3: వైసీపీ పాలనకు చరమగీతం పాడి.. చంద్రన్నకు పట్టం కట్టాలని రాయచోటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని బిఎర్రగుడి పంచాయతీ కాపుపల్లె, బీఏ నాగిరెడ్డిపల్లె, హరిజవాడ, చంచర్లపల్లె, నల్లగుట్టపల్లె, హరిజనవాడ, పాళెం గొల్లపల్లె పంచాయతీలోని చిన్నపోతులపల్లె, మామిడి గారిపల్లె, బుర్జుపల్లె, కోనంపేట, పుట్టకారవాండ్లపల్లెల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన వైసీపీ నాయకుల లెక్క తేలుస్తామన్నారు. చంద్రన్న మేనిఫెస్టోతో అన్ని కులాలు, మతాలవారికి న్యాయం జరుతుందన్నారు. పాళెం గ్రామంలో జరిగిన అక్రమాలు అన్యాయాలను బయటపెడతామన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో పాళెం గొల్లపల్లె నుంచి మర్రైకులమాను, మామిడిగారిపల్లె, నల్లగుట్టపల్లె కోనంపేట గ్రామాల రోడ్లు చాల అధ్వానంగా ఉన్నా.. 15గా ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న శ్రీకాంత్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఎవరూ పట్టించుకోవడం ఈ సందర్భంగా ప్రజలు మొరపెట్టుకున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి పాళెం, కోనంపేట, బి ఎర్రగుడి పంచాయతీల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలంటే ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రంలో సీనియర్ నాయకుడు ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదన్‌మోహన్ రాజంపేట పార్లమెంటు యువజన నాయకుడు తోపిరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, మండల టీడీపీ సీనియర్ నాయకుడు సిద్దక వెంకట రామిరెడ్డి, జైభీం దళిత మోర్చా అధ్యక్షుడు ఓబులేసు, శివారెడ్డి, వెంకటరామిరెడ్డి, సంతోష్, గంగయ్య, యోగాంజనేయరెడ్డి, నామల్లయ్య, సుదర్శన్ బాబు, జనార్దన్‌రెడ్డి, నారాయణ, అంకన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం

గాలివీడు: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే అన్ని వర్గాల వారికి సమన్యాయం జరిగిందని రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి చింతమరెడ్డి వెంకటశివారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మోపూరి రమణయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని నూలివీడు పంచాయతీ బోడసానివాళ్లపల్లె, శ్రీనివాసపురం, కొండ్రెడ్డిగారిపల్లెలో రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలు అమలవుతాయన్నారు. రాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలనివిజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు కానాల రామకృష్ణారెడ్డి, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు జనార్ధన, సురేంద్రారెడ్డి, సతీశ్‌రెడ్డి, గంగిరెడ్డి, నారాయణరెడ్డి, పెద్దిరెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శీను, కృష్ణాంజనేయులు, చంద్రప్ప, శేషాచలం, గంగాధర, చంద్ర, కృష్ణ, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండిపల్లి కుటుంబ సభ్యుల ప్రచారం

రాయచోటిటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో శుక్రవారం మండిపల్లి కుటుంబ సభ్యుల ప్రచారానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ, లక్ష్మీప్రసాద్‌రెడ్డి సతీమణి సౌమ్యరెడ్డి, సోదరి శ్రీలతమ్మ, మరో సోదరి విద్య, సోదరుడు మండిపల్లి రాహుల్‌రెడ్డి తదితరులు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను ప్రజలకి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డులోని ముఖ్య నాయకులు, టీడీపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముంబై ఎజాజ్‌ఖాన్ టీడీపీలో చేరిక

చిన్నమండెం: ప్రజాగళం కార్యక్రమానికి విచ్చేసిన టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నమండెం మండలానికి చెందిన ముంబై ఎజాజ్‌ఖాన్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎజాజ్‌ఖాన్ మాట్లాడుతూ ముస్లింలకు పెద్దపీట వేసింది టీడీపీ ప్రభుత్వమేనని హజ్‌యాత్రలు, దుల్హన్ పథకం, రంజాన్ తోఫా వంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు విదేశీ విద్యతో మైనార్టీ విద్యార్థులకు ఉన్నత స్థానం కల్పించారన్నారు. ఇలా ఆర్థికంగానే కాకుండా రాజకీయంగా టీడీపీ పార్టీ మైనార్టీలకు పెద్దపీట వేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముస్లిం మైనార్టీలపై దాడులు పెరిగాయాయన్నారు.



బోడసానివాండ్లపల్లెలో రాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



18వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న ముంబై ఎజాజ్‌ఖాన్

మహిళా ఉద్యోగులకు సమీపంలో ఎన్నికల విధులు కేటాయించాలి

రాయచోటిటౌన్, మే3: 2024 సాధారణ ఎన్నికల్లో మహిళా ఉద్యోగ, ఉపాధ్యాయులను సమీప నియోజకవర్గంలోనే ఎన్నికల విదులు కేటాయించాలని, పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు జిల్లా ఎన్నికల అధికారిని కోరారు. అన్నమయ్య జిల్లాలో ఓపీవో బాధ్యతలు కేటాయించే సందర్భంలో మహిళా ఉద్యోగ, ఉపాధ్యాయులను 150 నుంచి 200 కిలోమీటర్ల దూరంలో విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ముఖ్యంగా కోడూరు నియోజకవర్గం నుంచి బీ. కొత్తకోటకు, తంబళ్లపల్లె, పెద్దమండెం మండలాల నుంచి రైల్వేకోడూరు నియోజకవర్గంలో విదులు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం ఇబ్బందికరమన్నారు. మహిళా ఉద్యోగ, ఉపాధ్యాయులను వారు పనిచేస్తున్న నియోజకవర్గానికి సమీప నియోజకవర్గంలో ఎన్నికల విధులు కేటాయించేలా ఉత్తర్వులు సవరించిన అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు విన్నవించినట్లు వారు తెలిపారు. ఇదే సందర్భంలో కొంత మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్నప్పటికీ వారి ఓటు ఇతర జిల్లాల్లో ఉన్నందున వారి పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవడానికి రాయచోటిలోనే ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు వారు పనిచేస్తున్న లేదా వారి ఓటు హక్కు ఉన్న నియోజకవర్గంలో తమ పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకునే విధంగా అవకాశం ఇవ్వాలని, మే 5వ తేదీతో పాటు 6వ తేదీన కూడా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నల్లారిని కలిసిన కాంగ్రెస్ నేత ఫారూక్‌ఖాన్



నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డితో ఫారూక్‌ఖాన్

రాయచోటిటౌన్, మే3: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో రాజకీయాలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి తన విజయమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ముస్లింలను బీజేపీలో చేర్పించుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన టైగర్ బీడీ ఫ్యాక్టరీ యజమాని, రాయచోటి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు షారూక్‌ఖాన్‌తో పాటు మరి కొంత మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరడానికి రంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఆయన శుక్రవారం కలికిరిలోని కార్యాలయంలో కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి రాయచోటి నియోజక వర్గ రాజకీయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పొడదుప్పిపై కుక్కల దాడి



చికిత్స కోసం దుప్పిని తరలిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

సిద్దవటం, మే3 : కడప ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని నేకనాపురం గ్రామంలోకి వచ్చిన పొడదుప్పిపై శుక్రవారం ఉదయం కుక్కలు దాడి చేశాయి. గ్రామస్తులు శునకాల దాడి నుండి వన్యప్రాణిని కాపాడి కడపకు చెందిన అటవీ శాఖ రేంజ్ అధికారి ప్రసాద్‌కు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారి వెంటనే వారి సిబ్బందిని పంపించి గాయపడ్డ పొడదుప్పిని భాకరాపేట పశువైద్యశాలలో చికిత్స అందించి ఆ వన్యప్రాణి అడవిలో క్షేమంగా వదిలేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది నేకనాపురం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కరెంటు కోతతో అవస్థలు

పెనగలూరు, మే3 : పెనగలూరు మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 10 గంటలవరకు నిరంతరాయంగా కరెంటు కోత విధించడ ంతో ప్రజలు తిప్పలు పడ్డారు. నిరంతరాయంగా ఆరు గంటల కరెంటు కోతతో తాగునీటి మోటార్లు స్తంభించిపోయాయి. ఫలితంగా నీళ్లకోసం జనాలు తల్లడిల్లిపోయారు. ఇదిఇలా ఉండగా రెండు మూడు రోజుల నుంచి తీవ్రమైన ఎండల వల్ల భరించలేని ఉక్కపోతతో ఈ ఆరుగంటల సమయంలో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆదర్శవంతమైన జగన్ పరిపాలన అంటే ఇదేనా అని జనాలు హేళనగా మాట్లాడుకుం టున్నారు.

పక్షవాత బాధితుడికి ఆర్థిక సాయం

సిద్దవటం, మే3 : మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ వడ్డేరుపల్లెకు చెందిన బాలకొండయ్య కు పక్షవాతం సోకడంతో కాలు చెయ్యి పడిపోయింది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు కుప్పాల వెంకటసుబ్బయ్య శుక్రవారం ఆయనను పరామర్శించి, చికిత్స నిమిత్తం రూ. 5 వేలు ఆర్థిక సాయం చేశారు.

రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మందికి గాయాలు



చెట్టును ఢీకొన్న సుమో

ఒంటిమిట్ట, మే 3 : కారు చెట్టును ఢీకొనడంతో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. శుక్ర వారం తిరుపతి నుంచి ఆళ్లగడ్డ వైపు వెళుతున్న కారు అదుపుతప్పి మండల పరిధిలోని కడప-చెన్నై జాతీయ రహదారి పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొంది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. వీరిలో తీవ్రంగా గాయపడిని నలుగురిని కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వీరభద్రాలయంలో రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, మే 3: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు భద్రకాళి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించారు.

సుగవాసికి మద్దతుగా కదిలిన మహిళాలోకం


రాజంపేటలో ముస్లింలను కలిసి మద్దతు కోరుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం


మహబూబ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న నియోజకవర్గ టీడీపీ నేత పోలి సుబ్బారెడ్డి, మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ శ్రీవాణి


వీరబల్లిలో ప్రచారంలో భాగంగా వికలాంగ కార్యకర్తతో సుగవాసి ప్రసాద్‌బాబు


ఒంటిమిట్టలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు


టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యంకు మద్దతుగా భువనగిరిపల్లెలో పెద్దఎత్తున ప్రచారం చేస్తున్న యువకులు



కూచివారిపల్లె గ్రామంలో మహిళలతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, సుగవాసి బాలసుబ్రమణ్యంకు మద్దతుగా పెద్దఎత్తున ప్రచారం చేస్తున్న ప్రజలు

- **సైకిల్ గుర్తుకు ఓటేసి బాలసుబ్రమణ్యంను గెలిపించాలంటూ కూచివారిపల్లెలో పెద్దఎత్తున ప్రచారాలు..**
- **వాడవాడలా కూటమి నేతల ప్రచార హోరు**

రాజంపేట, మే 3: రాజంపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు మద్దతుగా మహిళాలోకం నడుంబిగించింది. పట్టణంతో పాటు అన్ని మండలాల్లో జనసేన, బీజేపీ, టీడీపీ నేతలతో కలసి మహిళలు పెద్దఎత్తున ప్రచారంలో పాల్గొంటూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నారు. రాజంపేట మండలం కూచివారిపల్లెలో ఎన్.టి.ఆర్ కాలనీ, అగ్రహారం, చుట్టుపక్కల ప్రాంతాల్లో మహిళలు సైకిల్‌గుర్తుకు ఓటు వేయాలని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో కూచివారిపల్లె గ్రామ ప్రజలు, యువతీ, యువకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ తనను మీ సోదరుడిగా భావించి ప్రచారం చేయడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. మీ మనోభావాలకు అనుగుణంగా అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని, ఇందుకు చంద్రబాబు హామీ ఇవ్వడం తనకు మహదానందాన్ని ఇస్తోందన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయడం, అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మించడం, మెడికల్ కళాశాల, రాజంపేట పట్టణం ప్రధాన పట్టణాలకు దీటుగా అభివృద్ధి, నియోజకవర్గంలోని ఆరు మండలాలను సర్వతోముఖాభివృద్ధి కి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూచివారిపల్లె సీనియర్ నాయకులు వెంకటయ్య నాయుడు, మండల మాజీ ఉపాధ్యక్షుడు రాంనరసింహులు, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి అమ్మినేని అజయ్, కాటుకూటి కిషోర్, దగ్గుపాటి వెంకటేశ్వర్లు, దగ్గుపాటి బాలాజీ, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

పోలి సుబ్బారెడ్డి ముమ్మర ప్రచారం

రాజంపేట పట్టణం మహబూబ్ నగర్ ప్రాంతంలో టీడీపీ నేత పోలి సుబ్బారెడ్డి ముమ్మరంగా ప్రచారం చేశారు. రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షుడు మల్లెల శ్రీవాణి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఇడిమడకల కుమార్, మైనారిటీ నేత గుల్జార్‌బాషా, షామీర్‌బాషా, మహిళా నేత ఉష, రాజంపేట మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ తుపాకుల అశోక్, బాలాజీ, చైతన్య, కిరణ్, కృష్ణమూర్తి, శంకరయ్య తదితరులుప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలి సుబ్బారెడ్డి, మల్లెల శ్రీవాణి మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడు, నిగర్వి టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాజంపేటను వైసీపీ ప్రభుత్వం అన్ని విధాలా సర్వనాశనం చేసిందని, వారికి ఓటు అడిగేహక్కు లేదన్నారు. తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

భువనగిరిపల్లెలో..

రాజంపేట మండలం భువనగిరిపల్లెలో స్థానిక యువకులు టీడీపీకి మద్దతుగా ప్రచారం చేశారు. జనసేన, తెలుగుదేశం పార్టీకి చెందిన యువకులు పెద్దఎత్తున పాల్గొని ప్రచారం చేశారు. రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ముస్లింల మద్దతు కోరిన సుగవాసి

రాజంపేట పట్టణంలోని ప్రధాన మసీదుల వద్ద ముస్లింలను కలిసి వారి మద్దతు కోరుతూ సైకిల్‌గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం విజ్ఞప్తి చేశారు. మైనారిటీ నాయకులు అబుబకర్, గుల్జార్‌బాషా తదితరులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం పట్టణంలోని మసీదుల వద్ద ముస్లింలను కలిసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

రాజంపేటటౌన్: పీలేరు నియోజకవర్గంలోని కలికిరిలో మోదీ పాల్గొననున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని బెంగుళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ఎండగడుతూ, ఈ రాష్ట్రానికి కూటమి ఆవశ్యకతను వివరించనున్నట్లు తెలిపారు. సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ కృష్ణ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌రాజు, జిల్లా కార్యదర్శి సమ్మెట నరేంద్రరాజు, మైనారిటీల జిల్లా షబ్బీర్, బీజేపీ నేతలు పోతుగుంట నాగేశ్వరరావు నాయుడు, మహిళా నేత సునీత తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: మండలంలోని పాటూరు పంచాయతీలో ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కమలం గుర్తుకు, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం సైకిల్‌గుర్తుపై ఓట్లు వేసి, వేయించి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సుగవాసి సుధాకర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, ఎద్దుల విజయసాగర్, కళ్యాణ్, పవన్, జంగంశెట్టి సుబ్బయ్య, ఆకులచలపతి, లవిడి శంకర్‌రాజు, తోట శ్రీను, శివరామరాజు, సుబ్బరాజు, రమేష్, రాము, గంగాధర్, హెచ్.డి. ప్రసాద్, సుబ్బరాయుడు, కిట్టయ్య, శ్రీరాములు, శ్రీనివాసులు, నరసింహ, మణి, జనసేన నాయకులు వెంకటసుబ్బయ్య, సుబ్బు, ప్రశాంత్, శ్రీనివాసులు, ప్రసాద్, మహేష్, శంకర్, చిన్న, కమాల్‌బాషా, హర్ష, ధను, శివ తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగోతు రమేష్‌నాయుడు పిలుపునిచ్చారు. మట్లి పంచాయతీలో ఇంటింటా ప్రచారం సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో కనుచూపుమేర అభివృద్ధి జాడ కనిపించడం లేదన్నారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా రాష్ట్రం ఉందన్నారు. దేశం అభివృద్ధి చెందాలన్న రాష్ట్రం బాగుపడాలన్న పీఎంగా నరేంద్రమోదీ, సీఎంగా చంద్రబాబునాయుడును గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తొలిసారి గ్రామానికి విచ్చేసిన ప్రసాద్‌బాబుకు మట్లి సర్పంచ్ నాగార్జునా చారి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు భానుగోపాల్ రాజు, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, వై.సురేందర్‌రెడ్డి, భూషయ్యనాయుడు, నేతి రమేష్, విజయ, నాగార్జున, నందకుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: రాజంపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను గెలిపించాలని జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ కోరారు. శుక్రవారం ఒంటిమిట్టలో మండల టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి శ్రీనివాసులు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యం, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. వైసీపీ అరాచక పాలన పోవాలంటే టీడీపీ రావాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. ఉద యం టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి శ్రీనివాసులు ఆధ్వర్యంలో చింతరాజుపల్లి పంచాయతీలోని కోమటి పల్లె, పత్రపల్లి, కోటికవారిపల్లె, చింతరాజుపల్లె, నరవకాటిపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి శ్రీనివాసులు, కొమరా వెంకటనరసయ్య, ఓబినేని సుబ్బమ్మ, మొదల పెంచలయ్య, అంగడాల వెంకటసుబ్బయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, అడ్వకేటు రాఆమదాసు, మామిళ్ల శ్రీహరి, గజ్జల నరసింహారెడ్డి, కరెంటు రమణ, బొబ్బిలి రాయుడు, కట్ట నారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


టీడీపీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సుబ్రమణ్యం


పాటూరులో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు



రాజంపేటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక ఎంపీ పీసీ మోహన్

సిద్దవటం: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం అందరూ నడుచుకోవాలని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం విజ్ఞప్తి చేశారు. సిద్దవటం మండలం పెద్దపల్లి గ్రామ పంచాయతీ భాకరాపేట వద్ద శుక్రవారం సాయంత్రం ఆయన సీనియర్ నేతలను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్ నాయకుల సలహాలు, సూచనలు ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ చంద్రబాబునాయుడు ఆదేశానుసారం పనిచేసి, పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.


హత్య కేసులో నిందితులు అరెస్టు


నిందితులను కోర్టుకు హాజరుపరుస్తున్న పోలీసులు

కమలాపురం రూరల్, మే 3: నగర పంచాయతీ పరిధిలోని పక్కీరువీధిలో మంగళవారం తెల్లవారుజామున మహ్మద్ బాషా అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసి కోర్టుకుహాజరు పరిచినట్లు సీఐ రామక్రిష్ణ రెడ్డి, ఎస్ఐ రుషికేశవరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం వారు పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని పక్కీరువీధిలో నివాసం ఉంటున్న ఉస్మాన్ గని బాషా కుమారుడు మహ్మద్‌బాషా అలియాస్ గని హత్యకు గురైన విషయం తెలిసిందే. అయితే క్రికెట్ విషయంలో చోటు చేసుకున్న ఘర్షణ హత్యకు దారి తీసిందని తెలిపారు. హత్య చేసిన వారు ఆ రోజు నుంచి పరారీలో ఉన్నారని, ప్రధాన నిందితులను శుక్రవారం పందిళ్లపల్లె గ్రామ సమీపంలో పోలీసు బృందాలు వెళ్లి పది మంది యువకులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులను కోర్టుకు హాజరుపరచగా రిమాండుకు తరలించారన్నారు.

చౌడేశ్వరి ఆలయానికి రూ.6.20 లక్షలు విరాళం

ప్రొద్దుటూరు, మే 3: ప్రొద్దుటూరు పట్టణం మేదరవీధికి చెందిన శ్రీరామలింగచౌడేశ్వరిదేవి ఆలయానికి అంపావతిన వీరప్రసాద్, పేరి గురుమూర్తి రూ.5.20 లక్షలు విరాళం అందజేశారు. శుక్రవారం స్థానిక మేదరవీధిలోని చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ఉట్టినాగశయనం, కార్యదర్శి గిద్దలూరు శ్రీనివాసులు సమక్షంలో వారు పై మొత్తాన్ని ఫిక్స్‌డ్ బాండ్ రూపంలో అందజేశారు. అలాగే కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి రూ.1 లక్ష విరాళం అందజేశారు. వీరందరికి ఆలయ కమిటీ తరఫున సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు పోసా వెంకటలక్షుమయ్య, గిద్దలూరు ఈశ్వరయ్య, పూజరి రాఘవేంద్రలు పాల్గొన్నారు.


ఆలయానికి విరాళం అందజేస్తున్న వీరప్రసాద్, గురుమూర్తిలు

దిగ్విజయంగా కేజీసెట్

సీకేదిన్నె, మే 3: కేజీసెట్ 2కె24 దిగ్విజయంగా ముగిసినట్లు కేఎస్‌ఆర్ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. కేఎస్‌ఆర్ఎం, కేఎల్ఎం కళాశాలలు సంయుక్తంగా ఇంటర్ ఉత్తీర్ణులై ఇంజనీరింగ్ చేయాలనే విద్యార్థులకు నిర్వహించిన కేజీసెట్ గత మూడు రోజులుగా మంచి స్పందన లభించిందని, శుక్రవారం దిగ్విజయంగా 2,900 మంది హాజరై పరీక్షలు రాసినట్లు తెలిపారు. ఎంసెట్ తరహాలో నిర్వహించే ఈ పరీక్ష వలన విద్యార్థులకు అవగాహన కలగడంతో పాటు కళాశాల అందించే సదుపాయాలను విద్యార్థులు ఉపయోగించుకోవచ్చన్నారు. కళాశాలలో కల్పించిన వసతుల పట్ల పరీక్షకు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్, ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ, వైస్‌చైర్మన్ మదనమోహన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరప్రసాద్, కేఎల్ఎం ప్రిన్సిపల్ ఎంవీ రత్నమ్మ, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ కిరణ్‌కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెన్సరీ సీనియర్ ఆఫీసర్ నాగరాజు, 2కె24 కన్వీనర్ కిశోర్‌కుమార్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



కేఎస్ఆర్ఎం కళాశాలలో కేజీసెట్‌కు హాజరైనవారు

యువతి ఆత్మహత్య

సంబేపల్లె, మే 3: మండలంలోని దేవపట్ల గ్రామం ఆవులవాండ్లపల్లెకు చెందిన షేక్.నౌజియా(19) శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలు రాయచోటిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

నన్నూ.. వదల్లేదేమన్నా...!

నా పేరు పెట్టి మరో ఊరికి న్యాయం చేస్తివి ● నా పేరున ఉన్న డ్యాం తెంపేస్తివి
నా స్వగ్రామాన్ని మరిచితివి.. ● జగనన్నా.. నాపై ఎందుకన్నా అంత కోపం..
● అన్నమాచార్యుల ఆత్మఘోష...



తెగిపోయి అనాథలా మారిన అన్నమయ్య ప్రాజెక్టు



రాజంపేట, మే3 : ఏడుకొండలవాడినే.. మెప్పించిన పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులను కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వదల్లేదు. ఆయన పేరిట ఉన్న అన్నమయ్య ప్రాజెక్టును ఇసుక దాహంతో తెంచేయగా ఆయన స్వగ్రామం కలిగి ఉన్న ప్రాంతాన్ని జిల్లా కేంద్రం చేయకుండా ఆయనను మనోవేదనకు గురి చేశారు. అంతేకాక అన్నమయ్య స్వగ్రామం తాళ్లపాకకు తట్టెడు సిమెంటు సైతం వేయకుండా ఆ గ్రామాన్ని అభివృద్ధి నిరోధకంగా తయారు చేశారు. దీంతో అన్నమయ్య చెప్పుకుంటున్న ఆత్మఘోష ఇది..

అన్నా.. జగనన్నా..... నీవు నాకంటే ఎంతో చిన్నోడివన్నా.... నీకంటే నేను అనేక శతాబ్దాల పెద్దోడిని. ఏకంగా ఏడు కొండలవానికి హాండీనే పెట్టినోడిని. ఆయనపై 32 వేల కీర్తనలు రాసి ఈ జగత్తుకు తెలిసినవాడిని. ఒక్కసారి అవకాశమివ్వమని అధికారంలోకి వస్తివి. కలియుగంలోని నేటి హైటెక్ యుగంలో కూడా అందరినీ ముంచి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసినోడివి. ఆ విషయం ఆటుంచితే సాక్షాత్తు జగత్తుకు మూలపురుషుడైన వెంకటేశ్వరుడి చేతనే శభాష్ అనిపించుకుంటున్న నన్ను కూడా వదలకపోతివి. నేనేదో.. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వరస్వామిపై కీర్తనలు రాసి ఆనాటి నుంచి నేటి వరకు కీర్తింపబడుతున్నా నన్ను ఎందుకూ కొరగాకుండా చేస్తివి.. ఊరూ.. వాడా తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన కూడళ్లలో నా ప్రతిమలు పెట్టుకోని ఊరు లేదు. అటువంటి నా గొప్పను ఒక్కసారిగా ఎందుకూ కొరగాకుండా చేస్తివి. నేను నా స్వగ్రామం తాళ్లపాకలో నా ప్రజల మధ్య వందల ఏళ్లగా ఉంటూ నాపేరిట అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటుంటిని.. నా గొప్పతనాన్ని మెచ్చిన... నాటి రాష్ట్ర పెద్దలు నా పేరుతో ఓ ప్రాజెక్టుకు రూపకల్పన చేశా రు. రాజంపేట, పుల్లంపేట మండలాల్లోని 22,500 ఎకరాలకు సాగునీరు అందుతూ ఏడాదికి రెండు పంటలు పుష్కలంగా పండేవి. ఏడు చెరువులకు మూడుకార్లకు కావాల్సిన నీరందేది. చుట్టుపక్కల వందల గ్రామాలకు తాగునీరు కావాల్సినంత అందేది.

నీవు అధికారం చేపట్టిన తరువాత నీ కన్ను అభం శుభం తెలియని నాపై పడింది. ఏదో దేవుడిపై చక్కని సంకీర్తనలు రాసి ఆయన మెప్పు పొంది ఎప్పుడో నేను వైకుంఠం చేరి నా ప్రాంతీయులను నెమరు వేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో పరలోకంలో ప్రశాంతంగా ఉన్న నన్నూ వదలకపోతివి. నేను చేసిన ద్రోహమేమో కానీ నా పేరిట ఉన్న అన్నమయ్య ప్రాజెక్టును నీ వందిమాగదులు నీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని లక్షల ట్రాక్టర్ల ఇసుక దోపిడీ చేసి కోట్లు గడించ పన్నాగం పన్నితిరి. రెండున్నరేళ్ల కిందట భారీ వర్షాలు పడుతుండగా నా డ్యాంలో కావాల్సినంత నీరు ముందుగానే ఉండగా ఆ నీటిని వదిలేయక మీ అనుయాయుల ఇసుకలారీలను కాపాడుకోవడానికి గేట్లు ఎత్తి నీటిని వదలలేదు. ఆ నీటిని కిందకి పంపితే కోట్లు కొల్లగొట్టడానికి పనికివచ్చే నీ ఇసుక లారీలు కొట్టుకుపోతాయని అధికారమదం తలకెక్కిన మీ దు రహంకారానికి నా ప్రాజెక్టు ఆనవాళ్లే లేకుండా తెగిపోయింది. తెగితే.. తెగింది కదా కింద 40 మంది పైబడి అమాయకులు ఆ నీటి వెల్లువలో కొట్టుకు పోతిరి. రాజంపేట, పెనగలూ రు, నందలూరు మండలాల పరిధిలోని చెయ్యేరు నదీపరివాహక ప్రాంతాల్లోని సుమారు 40 గ్రామాల వారు ఆ డ్యాం నీటితో సర్వనాశన మైతిరి. ఉన్న పంట పొలాలు, ఇసుక మేటల పాలయ్యాయి. సుమారు 500 కుటుంబాల ఇళ్లు వరదల్లో కొట్టుకుపోగా నాటి నుంచి నేటికీ వారికి ఒక ఇల్లు కట్టించకపోవడంతో ఎండకు, వానకు, తడుస్తూ విషపురుగులతో సావాసం చేస్తూ ఈ ప్రాంతం వద్దురా బాబో.. అంటూ అనేక మంది అభాగ్యులు ఊర్లకుఊర్లే ఇతర ప్రాంతాలకు వలస పోతిరి. వందల ఎకరాల భూముల్లో వేసిన ఇసుక మేటలను తొలగించకపోవడంతో భూములు వ్యవసాయానికి పనికిరాక రైతులందరూ అన్నమో.. రామచంద్రా అని అలమటిస్తిరి. వందల గోమాతలు, గేదెలు, ఎద్దులు, మేకలు అంబా.. అంబా... అంటూ అరుస్తూ వరదనీటిలో కొట్టుకుపోయినవి. ఇందులో నష్టపోయిన ఒక్క రైతునూ ఆదుకోకపోతివి. ఒక్క కుటుంబానికి ఇల్లు కట్టించి వారికి నివాస యోగ్యాలు చూపించకపోతివి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించకపోతివి.. సరికదా... తెగిపోయిన డ్యాంను రూ.800 కోట్లతో పునర్ నిర్మిస్తామని ప్రగల్భాలు పలికి, టెండర్లు పిలిచినట్లు నాటకాలు ఆడి కనీసం ఆ పనికి శంకుస్థాపన కూడా చేయకపోతివి. ఇలా నా బిడ్డలను నన్ను, సర్వనాశనం చేసిన నీకు నా ఆత్మఘోష ఎందుకు తగలకపోదూ.. ఈ బాధలో నేనుంటే మమ్మలను ఆదుకోకపోగా నా ప్రాంతాన్ని జిల్లా కేంద్రం చేస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసి తీరా అధికారమదంతో పుండుమీద కారం చల్లినట్లు డ్యాం తెగిపోయి సర్వం కోల్పోయిన మాకు తిరిగి జిల్లా కాకుండా చేసి నా పేరున ఆ జిల్లాకు పెట్టి నా ప్రాంతీయులను, నన్ను మరొకసారి ఘోరంగా అభాసుబాలు చేస్తివి.. అన్నమయ్య జిల్లా, అన్నమయ్య డ్యాంలను నీ పుణ్యమా అని లేకుండా చేస్తివి. కనీసం నా గ్రామంలో నేను పుట్టిన గడ్డలో నా పూర్వీకులు ఉన్న స్థలంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద కూడా పెచ్చులూడుతుండే పిడికెడు సిమెంటు చేయకపోతివి... నిత్యం సంకీర్తనాగానం జరిగే నా ప్రాంతంలో కనీసం ధ్యానమందిరం కూలిపోతుంటే నేటికీ చూస్తూ ఉంటివి.. నా స్వగ్రామం తాళ్లపాకను ఏ అభివృద్ధీ లేకుండా చేస్తివి.. గ్రామంలో నాలుగు రోడ్లు, సంకీర్తనా కళాశాల అని, ఉద్యానవనాలని, నిత్యం నగర సంకీర్తన అని, తిరుమల రీతిలో తాళ్లపాకను అభివృద్ధి చేస్తామని ఇచ్చిన మీ పార్టీ నేతల మాటలు గాలిలో కలిసి నోటి మాట రాక నేను, నా ప్రజలు మూగచ్చవంతో నిస్సహాయులమైతిమి.. నేటి ఎన్నికల్లో నీవు చేసిన ద్రోహాలకు మా ప్రాంతీయుల, నా ఆత్మఘోష ఎందుకు తగలకపోదో.. జగనన్నా..

- ఇదీ అన్నమయ్య ఆత్మఘోష



అన్నమయ్య ప్రాజెక్టు తెగడంతో వేసిన ఇసుకమేటలను తొలగించని దృశ్యం



తాళ్లపాకలో కూలేందుకు సిద్ధంగా ఉన్న అన్నమయ్య ధ్యానమందిరం



అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో విగత జీవులైన దృశ్యం (ఫైల్ ఫొటో)

ఈ ఓట్ల కథ తెలుసా...



కడప (ఎర్రముక్కపల్లె), మే 3: ఓటు వజ్రాయుధం, ప్రజాస్వామ్య మనుగడను శాసించేది ఓటు. భారత ప్రభుత్వం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కులమత లింగ బేధం లేకుండా ఓటు హక్కు కల్పించింది. ఆ ఓటును వివధ రకాలుగా ఎన్నికల్లో వేసి తమకు నచ్చిన వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటారు. ఒక్క ఓటుకు ఒక్కో ప్రత్యేకత ఉంది.

సాధారణ ఓటు

18 ఏళ్లు నిండిన భారత పౌరుడు ఓటు హక్కును కలిగి ఉంటాడు. ఫారం6ను పూర్తి చేసి ఆధార్, రేషన్‌కార్డు, నివాస ధృవపత్రాలు చూపిస్తే ఓటు హక్కు లభిస్తుంది. దీనిని సాధారణ ఓటు అంటారు. సాధారణ ఓటు పోలింగ్ రోజున ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి వేస్తారు. అత్యధికులు ఇదే పద్దతిలో ఓటు వినియోగించుకుంటారు.

పోస్టల్‌బ్యాలెట్



ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు సాధారణ ఓటర్లై ఉంటారు. వారిని ఎన్నికల విధులకు నియమిస్తే పోలింగ్ రోజు తమ ప్రాంతంలో ఓటు వేసే అవకాశం ఉండదు. అందువల్ల వారు ముందస్తుగానే ఫారం12 నింపి తమ ఎన్నికల ఆదేశాలు ఆధార్ జిరాక్స్‌లతో రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేస్తారు. వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటు అందిస్తారు. గతంలో పోస్టుద్వారా పంపించేవారు. ప్రస్తుత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగానికి నియోజకవర్గాల వారీగా ఫెసిలిటేష్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. కడప ప్రధాన జిల్లా కేంద్రంలోనూ వివిధ మండల కేంద్రాల్లోనూ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసే అవకాశాన్ని కల్పించారు.

ప్రాక్సి ఓట్‌ఫర్ సీఎస్‌వీ



దేశ భద్రతా విధుల్లోఉన్న సైనికుల కోసం ప్రత్యేకంగా ప్రాక్సిఓటు విధానం ఏర్పాటు చేశారు. సైన్యంలో విధులు నిర్వహించేవారు ఓటు వేయడానికి రాలేని పరిస్థితి. అందువల్ల వారికి క్లాసిఫైడ్ సర్వీసు ఓటు అందిస్తారు. వారి తరపున పీఎస్‌వీ అనుమతి పొందిన వ్యక్తి వచ్చి పోలింగ్ బూత్‌లో ఓటు వేయవచ్చు. లేదా క్లాసిఫైడ్ ఓటరు సర్వీసు తరపున తాము వేయడానికే వచ్చిన వారిని ప్రాక్సీఓటరు అని, అతని ఓటును ప్రాక్సీ ఓటు అని అంటారు

ఛాలెంజ్ ఓటు

ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తిని అతను నిజమైన ఓటరు కాదని పోలింగ్ ఏజంటు అభ్యతరం చెప్పి ఛాలెంజ్ చేస్తారు. పోలింగ్ ఏజంటు వద్ద రూ.2 ఫీజు కట్టించుకుంటారు. పోలింగ్ ఏజంటు ఇచ్చిన వ్యక్తి వాదనలు విన్న పీఓ గుర్తింపు కోసం బీఎల్‌ఓ ఇతర ఓటర్ల ద్వారా నిజమైన ఓటరా కాదా అని నిర్ధారించుకుంటారు. నిజమైన వ్యక్తి అయితే ఓటింగ్‌కు అనుమతి ఇస్తారు. కాకుంటే పోలీసులకు అప్పగించి పోలింగ్ ఏజంటు కట్టిన ఫీజు అతనికి తిరిగి ఇస్తారు. ఛాలెంజ్ ఓటు వేసిన వ్యక్తి వివరాలు ఫారం 14లో నమోదు చేస్తారు.

ఇంటి నుంచి ఓటు



85 ఏళ్లు దాటిన వృద్ధులకు దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసుకునే అవకాశాన్ని ఈదఫా ఎన్నికల కమిషన్ కల్పించింది. నిబంధనల మేరకు ఇళ్ల వద్ద వీరంతా ఓటు వేయాల్సి ఉంటుంది.

టెండరు ఓటు

ఇది ప్రత్యేక ఓటు. వేయడానికి వచ్చిన వ్యక్తి ఓటు అప్పటికే ఎవరో వేసి ఉంటే ఈ ఓటును నిబంధనల ప్రకారం ప్రిసైడింగ్ ఆఫీసరు జారీ చేస్తారు. తాను రాకుండానే ఎవరో ఓటు వేశారని నిరూపించుకోవాలి. దీంతో పీఓ టెండరు ఓటు ఇస్తారు. టెండరు ఓటు ఈవీఎంలో వేయడానికి వీలు లేదు. బ్యాలెట్ అందిస్తారు. బ్యాలెట్‌లో ఓటు వేసిన తరువాత పీఓకు అందించాల్సి ఉంటుంది. దీనిపై పీఓ సంతకం చేస్తారు. దానిని ఫారం 17బీ, 17సీలో నమోదు చేస్తారు. దానిని ప్రత్యేక కవరులో పెట్టి సీల్ చేస్తారు. పరిస్థితులు బట్టి దానిని పరిగణనలోకి తీసుకుంటారు.

ఎన్‌ఆర్‌ఐ ఓటు

విదేశాల్లో ఉన్న నాన్ రెసిడెంట్ ఇండియన్స్‌కు ఓటు హక్కు కల్పించారు. ఆన్‌లైన్ ఫారం2 నింపి తగిన ఆధారాలు చూపిస్తే ఎన్‌ఆర్‌ఐలకు ఓటు హక్కు కల్పిస్తారు. ఆసక్తి మేరకు విదేశాల నుంచి పోలింగ్ రోజున వచ్చి ఓటువేయవచ్చు.

కామ్రేడ్ అన్నా.. ఇదే సంగటన్నా....



సంగటిని గెలుకుతున్న కామ్రెడ్‌లు

రాజంపేట, మే3: అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం.. వారి తరపున నిత్యం ప్రభుత్వంతో పోరాడే వామపక్ష నేతలు ఎక్కడున్నా శ్రమైక జీవన విధానంలో పేదల జీవన విధానానికి అనుగుణంగా ఉంటారు. ఆ కోవలో రాజంపేట ఎమ్మెల్యే స్థానానికి సీపీఐ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా బొకే విశ్వనాధ నాయక్ పోటీ చేస్తున్నారు. ఆయన తరపున ఉభయ కమ్యూనిస్టు పార్టీల కామ్రేడ్‌లు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా అట్టడుగు వర్గాలు ఎంతో ఇష్టంగా తినే సంగటిపై వీరు దృష్టిపెట్టారు. అంతే.... ఒక్కసారిగా బడుగులతో కలిసి కట్టెలను పోగు చేయడం, రాళ్లపెట్టుకోవడం, ఒక పెద్ద డబరా తేవడం, సంగటి గెలకడం చకచకా జరిగిపోయాయి. అంతే తలా ఇంత ఒక ముద్ద ఆకులో పెట్టుకోవడం, రోంత పచ్చడేసుకోవడం, పిడసలు చేసుకుని నోరారా తినడం.. దీనిని వారు పంచభక్ష పరమాణ్ణంగా తినేయడం. తిరిగి ప్రచారాల్లో పాల్గొనడం. ఇదీ ప్రచారాల్లో బడుగు వర్గాలకు అండగా ఉండే కామ్రెడ్‌ల తీరు. ఇంత కష్ట పడి ప్రచారం చేస్తుంటే వారి ఆశలు కనుచూపు మేరలోనైనా కనిపిస్తాయా అన్నది శేష ప్రశ్న.

హవ్వ.. ఎన్నికల చిత్రం



అవ్వకు బ్యాలెట్ పత్రాన్ని చూపుతున్న దృశ్యం

రాజంపేట, మే3: నేటి హైటెక్ యుగంలో అ..ఆ కూడా రాని అవ్వాతాతల ఓట్లు ప్రధాన పార్టీలకు పెద్దసవాలుగా మారాయి. ఎందుకంటే చదువు రాని అవ్వాతాతలకు ఎక్కడ ఓటు వేయాలో.. ఏ గుర్తుపై వేయాలో, ఎవరు ఏ అభ్యర్థో అర్థం కాని పరిస్థితి. అందువల్ల పోలింగ్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు వారి బిడ్డలు చెప్పినట్లు మా గుర్తు ఫలానా దానికి వేయాలని ఉద్యోగుల ద్వారా వేయించుకోవడం ఎక్కువ శాతం జరుగుతోంది. లేకుంటే ఆ ఓటు మురిగిపోయినట్లే.. వారికి అర్థం కాక, వేయడం చేతకాక ఇష్టమొచ్చినట్లు వేసేస్తారు.. అందుకనే ఆయా గ్రామాల్లో యువకులు, ఆయా పార్టీల నేతలు అవ్వాతాతలకు ఎక్కువగా దీనిపై హితబోధ చేస్తుంటారు. వారి వద్దకు వెళ్లి అభ్యర్థుల ఎన్నికలను బ్యాలెట్ పత్రం రూపేణా చిత్రించిన కరపత్రాన్ని చూపిస్తూ ఇది సైకిల్ గుర్తు.. ఇది గ్లాసు గుర్తు, ఇది ఫలానా గుర్తు అని చెప్పి ఫలానా ఆయన మన అభ్యర్థి అని వారికి గుర్తుండేలా చెప్తారు. భువనగిరిపల్లెలోని ఆయా ప్రాంత యువకులు దీనిపై కసరత్తు చేశారు.. తమ గ్రామంలోని అవ్వలు, తాతల వద్దకు వెళ్లి ఇలా గుర్తు చూపిస్తూ ఓట్లు వేయాలని ప్రాధేయపడుతున్నారు. ఇందులో నేటి చిత్రం తెల్లారకముందే తొలిసూర్య కిరణాలు పడే వెలుతురులో కరపత్రాన్ని చూపుతూ సైకిల్ గుర్తుకు వేయాలని అవ్వకు ఓ యువకుడు సూచిస్తున్న చిత్రం. నేటి అవ్వాతాతల ఎన్నికల విధానంలో వారి పాత్రపై చెప్పకనే చెబుతోంది.

అభ్యర్థి కటౌట్‌లు చూపిస్తూ మహిళల ప్రచారాలు

రాజంపేట, మే3: రాజంపేట నియోజకవర్గం ఒక పెద్ద జిల్లాను పోలి ఉంటుంది. రైల్వేకోడూరు బార్డర్ నుంచి కడప జేఎంజే వరకు ఇటు బద్వేలు నియోజకవర్గం అట్లూరు వరకు, అటు పీలేరు వరకు, రాయచోటి వరకు మరో వైపు వేంపల్లి బార్డర్ వరకు ఈ నియోజకవర్గ విస్తీర్ణం 150 కిలోమీటర్ల పైబడి ఉంటుంది. అన్నీ గుట్టలు, కొండలు, ఘాట్ రోడ్లు సుమారు వంద గ్రామ పంచాయతీలు, ఇందులో వెయ్యికి పైబడి మజరా గ్రామాలున్నాయి. నియోజకవర్గంలో రెండున్నర లక్షల పైబడి ఓటర్లు, 5లక్షల జనాభా ఉంటుంది. ఇన్ని ప్రాంతాల్లో పార్టీ టికెట్టు తీసుకున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్ని గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. కనీసం మూడు నెలలైనా సమయం ఉంటే తప్ప అన్ని పల్లెలను టచ్ చేయడం కష్టం.. అందువల్ల ఆయా ప్రాంత నేతలు సుగవాసి బాలసుబ్రమణ్యం కటౌట్‌లు ఏర్పాటు చేసుకుని ఈయనే.. సుగవాసి బాలసుబ్రమణ్యం, సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నినాదాలు చేస్తూ ఆయన పోలిన కటౌట్‌లను ప్రజలకు చూపుతున్నారు. ఇది చూసిన వరికి ఈయనేనా.. మన కాబోయే ఎమ్మెల్యే అంటూ.. మన గుర్తు సైకిల్ బాలసుబ్రమణ్యంకే ఓటు అంటూ ఓటర్లు సంబరపడుతున్నారు.



సుగవాసి బాలసుబ్రమణ్యం కటౌట్‌లతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మహిళలు

ఉప్పొంగిన యువ'చైతన్య'ం

వెయ్యిమందితో భారీగా బైక్‌ర్యాలీ



జాతీయ రహదారి పై యువకుల బైక్ ర్యాలీ

చెన్నూరు, మే 3: టీడీపీ కార్యకర్తలు, అభిమానుల్లో యువచైతన్యం ఉప్పొంగింది. ఇప్పటికే కమలాపురం నియోజకవర్గ వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు గోర్ల పుల్లయ్యగారి శివారెడ్డి శుక్రవారం పార్టీలో చేరడంతో ఆయన వెంట యువత పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తూ పుత్తాచైతన్య రెడ్డికి బ్రహ్మరథం పట్టారు. ఎన్నడూ లేని విధంగా దాదాపు వెయ్యికి పైగా ద్విచక్రవాహనాలతో రెండు కి.మీ మేర భారీ ర్యాలీ చేశారు. పట్టణంలోని కేఓఆర్ కాలనీ మొదలు గవర్నమెంట్ ఆస్పత్రి, బుడ్డాయపల్లె క్రాస్ రోడ్డు, హైవే మీదుగా కొత్త రోడ్డు, నాగులకట్టవీధి, పార్కువీధి, పాతబస్టాండ్, తహసీల్దారు ఆఫీసు మీదుగా ఎల్లమ్మ ఆలయం వరకు ఈ ర్యాలీ చేపట్టారు. ర్యాలీ పొడవునా సైకో పోవాలి, సైకిలు గెలవాలి, చైతన్యరెడ్డి జిందాబాద్, చైతన్యను గెలిపించుకుందాం, టీడీపీ జిందాబాద్ అంటూ నినాదాలు హోరెత్తాయి.

తెలుసుకోండి...

టోల్ ఫ్రీ నెంబర్ 1950 ఎందుకంటే..!



మైదుకూరు, మే 3: కేంద్ర ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 1950 అమలులోకి తీసుకొచ్చింది. దేశ వ్యాప్తం గా ఆ నెంబరుతో అన్ని జిల్లాల్లోనూ కాల్ సెంటర్లను ఏర్పాటు చేసిం ది. ముఖ్యంగా 1950 నెంబరునే ఎందు కు ప్రవేశపెట్టిందనే విషయం వెనుక ప్రత్యేకత దాగి ఉంది. దేశంలో ఎన్నికల సం ఘం 1950 సంవత్సరం లోనే ఏర్పడింది. దీంతో అప్పటి నుంచి సార్వత్రిక, స్థానిక సంస్థలు సహా పలు రకాల ఎన్నికలను నిర్వహిస్తోంది. ఎన్నికల కమిషను ప్రారంభించిన "చ్చిటికి గుర్తు గా ఈ నెంబరును దేశ వ్యాప్తంగా అమలు చేస్తోంది.

ఇదో గోల.....

ఐదేళ్లలో ఉన్నదీ పోగొట్టుకున్న సర్పంచులు

ఎకరాలకు ఎకరాలు అమ్ముకున్న వైనం..!




రైల్వేకోడూరు, ఏప్రిల్ 30: సర్పంచులుగా పోటీ చేసేందుకు ఖర్చు పెట్టుకుని ప్రజాసేవ చేస్తామని అనుకుని గెలిచి ఊరికి రోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని చెప్పి చివరకు నిధులు రాక సొంత ఆస్తులు, వ్యవసాయ భూములను అమ్ముకుని చివరకు పైసా లేకుండా పోయిందని సర్పంచులు ఆందోళన పడుతున్నారు. ప్రస్తుతం ఎన్నికలు వచ్చాయి మళ్లీ గెలిపించమని అడుగుతున్నారని ప్రజల్లోకి ఎలా వెళ్లి ఓట్లు అడగాలని సర్పంచులు మదనపడుతున్నారు. నాయకులు మాత్రం ఎలాగైనా ఈ సారికి గెలిపించాలని సర్పంచులు కాళ్లు పట్టుకుంటున్నారు. రైల్వేకోడూరు మండలంలోని సుమారు పలువురు సర్పంచులు తమ వ్యవసాయ భూములను తాకట్టు పెట్టారు. మరి కొందరు భూ విక్రయాలు చేశారు. పుల్లంపేట, చిట్వేలి, పెనగ లూరు, ఓబులవారిపల్లె పంచాయతీల్లో కొందరు సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రాక తీవ్రంగా ఇబ్బందులు పడుతూ పరపతి తెచ్చిన చోట పరువు పోతోం దని ఏకంగా బంగారు నగలు, వ్యవసాయ భూములు పోగొట్టుకున్నారు. నాయకత్వం వహించే వారు సర్పంచులను పట్టించుకోకుండా ఉండడం, లెక్క చేయకపోవడం వంటివి ఐదేళ్ల నుంచి జరుగుతున్నాయి. దీంతో సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. కేవలం కొందరి సర్పంచులకు న్యాయం చేస్తున్నారని ప్రచారం లో ఉంది. ప్రస్తుతం చాపకింద నీరు లా సర్పంచులు కూటమికి బలం చేకూరుస్తున్నారు.

అప్పుడేనా?.....

చోటా నేతలతో రాయబేరాలు

వైసీపీలో చేరిన వారికి ఆఫర్లు



బద్వేలు, మే 3: ఎన్నికలు దగ్గర పడుతుండడంతో బద్వేలు నియోజకవర్గంలో గ్రామ, వార్డుస్థాయిలో చిన్న చిన్న నేతలు, మండలస్థాయి నేతలకు డిమాండ్ ఏర్పడింది. 10 ఓట్లు వేయించగలడన్న నమ్మకమున్న వారిన సైతం చేరదీసేందుకు పార్టీ నేతలు పోటీ పడుతున్నారు. పోలింగ్ బూత్‌లో కూర్చునేందుకు అవసరమైన ఏజంట్లకోసం అన్వేషణ మొదలైంది. నాయకులు ఓ వైపు ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తూనే మరోవైపు ఎన్నికల నిర్వహణకు అవసరమైన డబ్బు, మందు, కార్యకర్తల సేకరణలో పూర్తిగా నిమగ్నమయ్యారు. పట్టణ ప్రాంతాల్లో వార్డుస్థాయి నేతలను గ్రామాల్లో గ్రామస్థాయి నేతలను తమవైపు తిప్పుకునేందుకు వైసీపీ బేరసారాలకు తెరలేపింది. ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలకు అవసరమైన పనులను చేయిస్తామని, స్థాయిని బట్టి అవసరమైన పనులు చేపడతామని, కొంత డబ్బు ముట్ట చెప్పి పార్టీలో చేర్చుకుంటున్నట్లు సమాచారం. ఇతర పార్టీల నుంచి బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో ఓ కౌన్సిలరు, మాజీ కౌన్సిలరు వైసీపీలో చేరారు. మండల పరిధిలోని వెంకటశెట్టిపల్లెలో ఓ నాయకుడు వైసీపీలో చేరారు. గ్రామాలలో, పట్టణాల్లో ప్రాబల్యం ఉన్న నేతలకు వివిధ ఆఫర్లు ఇచ్చి వైసీపీలో చేర్చుకోవడం పట్ల ఇలాంటి వారు చేరడం వలన పార్టీకే నష్టం జరుగుతుందని ఆపార్టీ నేతలు కొందరు గుసగుసలాడుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో గతంలో లేనంత ఎక్కువగా డబ్బు ప్రభావం కనిపిస్తోంది. ఇలా వైసీపీలో చేరిన కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు మండల స్థాయి నేతలకు లక్షలాది రూపాయల డబ్బు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో బేరసారాలకు వైసీపీ తెరలేపడంతో కొందరికి గిరాకీ ఏర్పాడింది. నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రోశన్నకు లభిస్తున్న ఆదరణను చూసి వైసీపీకి వణుకు పుడుతోంది. ఈ నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి ఆఫర్లు ప్రకటిస్తూ వైసీపీ నేతలు తమ పార్టీలో చేర్చుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

జన చేతనం



ప్రతి బిడ్డను చదివించే బాధ్యత తనదన్నారు. ఒక తల్లికి ఎంతమంది బిడ్డలుంటే అంతమందికి ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తానన్నారు. విపక్ష నేతగా ఇలా మాటలు చెప్పి 2019 ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. రూ.15 వేలను కాస్త రూ.13 వేలు చేశారు. ఒక బిడ్డకే అమ్మఒడిని పరిమితం చేశారు. ఆంక్షల పేరిట మరికొంత మందిని అనర్హులను చేశారు. ఇలా ఐదేళ్లలో 80 వేల మందికి అమ్మఒడిని దూరం చేశారు.

- చిత్తూరు (సెంట్రల్)



అమ్మో జగనా..!

నొక్కింది ఉత్తుత్తి బటనే

మాట తప్పిన సీఎం

- అమ్మ ఒడికి 80 వేల మంది దూరం
- ఏటా ఆంక్షలతో కోతలు
- టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి విద్యార్థికి అమ్మకు వందనం

'నేను సీఎం కాగానే 2019-20 విద్యా సంవత్సరంలోనే అమ్మ ఒడి ఇచ్చా. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా' అంటూ చిత్తూరులో 2020 జనవరిలో అమ్మఒడి పథకాన్ని సీఎం జగన్ ప్రారంభించారు. ఈ పథకం కోసం తొలి ఏడాది ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2,42,672 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. ఈ సంఖ్య 2022-23 నాటికి (నాలుగేళ్లలో..) 1,62,477 మందికి చేరింది. అంటే 80,195 మంది అమ్మఒడికి దూరమయ్యారు. చివరి సంవత్సరానికి ఈ పథకానికి డబ్బులు ఇవ్వలేదు.

సంవత్సరం	విద్యార్థులు	అర్హులైన తల్లులు	నగదు జమైన వారిసంఖ్య
2019-20	2,81,424	2,42,672	1,49,727
2020-21	2,67,639	2,30,672	1,43,643
2021-22	2,74,088	1,65,382	1,53,345
2022-23	2,44,706	1,62,477	1,52,542

- తొలి ఏడాది 2,81,424 మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో చదువుతుండగా, వీరికి 2,42,672 మంది తల్లులు ఉన్నట్లు గుర్తించారు. చివరకు 1,49,727 తల్లుల బ్యాంకు ఖాతాల్లో మాత్రమే తొలి ఏడాది రూ.15 వేలు చొప్పున నగదు జమచేశారు. తొలి ఏడాదే 92,945 మంది తల్లులలకు డబ్బులు రాలేదు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు.. అప్పట్లో విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులను ప్రశ్నిస్తే వీరంతా ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించినట్లు తెలిపారు.
- 2020-21లో 2,67,639 విద్యార్థులకు సంబంధించి 2,30,672 తల్లులను గుర్తించగా, చివరకు 1,43,643 మంది తల్లుల ఖాతాల్లో నగదు జమచేశారు. ఈ ఏడాదిలో అమ్మఒడికి దూరమైన వారిలో 87,029 మంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేసే వారితో పాటు బ్యాంకు ఖాతాలు సరిగ్గా లేని వారున్నారని అధికారులు సమాధానం ఇచ్చారు.
- 2021-22లో 2,74,088 మంది విద్యార్థులకు 1,65,382 మంది తల్లులను అమ్మఒడికి అర్హులుగా గుర్తించారు. వీరిలోనూ 1,53,345 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో మాత్రమే నగదు జమచేశారు. ఆ ఏడాదిలో 12,037 ఖాతాల్లో డబ్బులు పడలేదు.
- 2022-23లో 2,44,706 మంది విద్యార్థులకు 1,62,477 మంది తల్లులను గుర్తించగా, 1,52,542 మంది బ్యాంకు ఖాతాల్లో నగదు జమైంది. 9935 మంది తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు.

చివరి రెండేళ్లలో..

ఇలా, చివరి రెండేళ్లలో 21,972 మందికి అమ్మఒడి డబ్బులు రాలేదు. దీనిపై వారు విద్యార్థుల తల్లిదండ్రులు.. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని అడిగితే.. బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ లేదని, మీరు పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరచుకోమని సలహా ఇచ్చారు. బ్యాంకుల్లోని తమ ఖాతాలకు ఆధార్ లింక్ చేయాలని లబ్ధిదారులు బ్యాంకు సిబ్బందిని కోరగా.. అన్నీ సరిగ్గా ఉన్నాయని వారు జవాబిచ్చారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వివిధ కారణాలతో తమను ఉద్దేశపూర్వకంగానే అమ్మఒడి పథకానికి దూరం చేశారని భావించిన లబ్ధిదారులు పోస్టాఫీసుల్లో కొత్త బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు ఆసక్తి చూపలేదు. ఇలా జగన్ ప్రభుత్వం ఏటా దశలవారీగా వేలాది మంది లబ్ధిదారులకు అమ్మఒడిని దూరం చేసింది.

నిబంధనల పేరిట కోతలు...

అమ్మఒడికి జగన్ ఆంక్షలు పెట్టారు. తొలుత ఒక బిడ్డకే పథకాన్ని పరిమితం చేశారు. ఆ తర్వాత చాలా మంది ఆధార్‌కార్డు ఈకేవైసీ చేయకపోవడం, విద్యార్థుల హాజరు శాతాన్ని తెరపైకి తెచ్చారు. అనంతరం ఇంట్లో విద్యుత్ వినియోగం 300 యూనిట్లు మించరాదన్నారు. సాగుభూమి, ఇతర కారణాలతో వేలాది మందిని అనర్హులుగా చేర్చారు. కొన్ని పాఠశాలల్లో అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఆధార్ కార్డు సక్రమంగా లేదంటూ బ్యాంకుల్లో నగదు జమ చేయలేదు. పైగా జనవరిలో ఇచ్చే అమ్మఒడి జూన్ నెలకు మారడంతో ఒక విద్యాసంవత్సరం మిస్ అయింది. ఇక, పర్యవేక్షణ విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారుల నుంచి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల చేతికి వెళ్లింది.


రూ.15 వేల నుంచి రూ.13 వేలకు

అమ్మఒడి పథకం కింద ప్రతి విద్యార్థికి వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేలు జమచేస్తానని జగన్ చెప్పారు. తొలి ఏడాది జనవరిలో రూ.15 వేలు జమచేశారు. ఆ తర్వాత పాఠశాల మరుగుదొడ్డి నిర్వహణ పేరుతో ప్రతి తల్లి రూ.వెయ్యి ఇవ్వాలని చెప్పారు. కొందరు మాత్రమే ఇచ్చారు. దీంతో 2021-22 నుంచి ప్రభుత్వమే రూ.వెయ్యి మినహాయించి రూ.14 వేలనే ఖాతాల్లో జమచేసింది. ఆ తర్వాత మరో రూ.వెయ్యి కోతపెట్టి రూ.రూ.13 వేలే ఇస్తోంది.

టీడీపీ వస్తే అందరికీ 'తల్లికి వందనం'

2024లో టీడీపీ అధికారంలోకి రాగానే.. ఒకే ఇంట్లో ఎంత మంది బిడ్డలు బడికి వెళతారో వారందరికీ 'తల్లికి వందనం' పేరుతో ఏటా రూ.15 వేలు తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చెప్పారు. ఈ మేరకు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారు. దీంతో 'అమ్మఒడి'కి దూరమైన 80,195 మందికీ 'తల్లి వందనం' లభించనుంది.

- రెండు నెలలైనా తల్లుల ఖాతాల్లో జమకాని 'విద్యాదీవెన' డబ్బులు
- విద్యార్థులపై కళాశాల యాజమాన్యం ఒత్తిడి
- అప్పుచేసి ఫీజులు కడుతున్న తల్లిదండ్రులు



పేద బిడ్డల ఉన్నత చదువుకు నేను బటన్ నొక్కుతున్నా, ఇక్కడ్నుంచి నే....రుగా పిల్లలు, తల్లుల జాయింట్ అకౌంట్‌కే డబ్బులు చేరతాయి.

- కృష్ణాజిల్లా పామర్రులో మార్చి ఒకటో తేదీన బటన్ నొక్కి విద్యాదీవెన నిధులను విడుదల చేసిన సందర్భంగా సీఎం జగన్ చేసిన ప్రకటన ఇది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో ఈ మాట చెప్పారు.

వాస్తవం: రెండు నెలలు దాటినా రూపాయి కూడా జమకాలేదు. పామర్రు నుంచి నే...రుగా డబ్బులు రావడానికి మధ్యలో ఆటంకాలేమైనా ఉన్నాయా అంటూ విద్యార్థుల తల్లులు మండిపడుతున్నారు.

డిసెంబరులో బటను నొక్కినా: మార్చి నెలే కాదు.. భీమవరంలో గతేడాది డిసెంబరులో నొక్కిన బటనుకూ మూడో వంతు మందికి ఇంకా డబ్బులు జమకాలేదు. అయినా, తాను పేద బిడ్డల పెద్ద చదువులకు కృషి చేస్తున్నానని, ఈ క్రమంలో విపక్షాలతో యుద్ధం చేయాల్సి వస్తోందంటూ ఆ సభల్లో చెప్పడం సీఎం జగన్‌కే చెల్లింది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు టీడీపీ హయాంలో ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు.. ప్రస్తుత ప్రభుత్వం 'జగనన్న విద్యాదీవెన' అని పేరు మార్చింది. ఇంటర్ వరకు అమ్మఒడి పథకంలో చేర్చడంతో ఆపై డిగ్రీ, పీజీ, డిప్లొమా ఇతర కోర్సులు చదువుకున్న విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకాన్ని అందిస్తున్నారు. ప్రతి త్రైమాసానికి ఒకసారి సభలు పెట్టి సీఎం జగన్ బటన్ నొక్కుతున్నారు. ప్రతిసారి ఈ పథకం కోసం ప్రభుత్వ నిధులతో ప్రకటనలు ఇస్తున్నారు. ఆ సభల్లో రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారు. కానీ, విద్యా, వసతి దీవెన డబ్బులు మాత్రం తల్లుల ఖాతాల్లో సకాలంలో జమ కావడంలేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 324 కళాశాలల్లో సుమారు 40వేల మంది ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరి కోసం డిసెంబరు 28వ తేదీన సీఎం జగన్ భీమవరం సభలో బటన్ నొక్కారు. ఆ బటన్ సరిగా పనిచేయలేదేమో కానీ.. ఉమ్మడి జిల్లాకు రూ.31.54 కోట్లకుగాను రూ.20.54 కోట్లే తల్లుల ఖాతాల్లో జమయ్యాయి. నాలుగు నెలలు దాటినా రూ.11 కోట్లు ఇంకా జమ కాలేదు. అలాగే, మార్చి ఒకటిన నొక్కింది 'ఉత్తుత్తి బటన్'లాగా ఉంది. ఎందుకంటే ఆ త్రైమాసానికి సంబంధించి ఇంకా రూ.29.4 కోట్లు జమ కానే లేదు. ఇప్పుడు ఎన్నికలు కూడా వచ్చేశాయి. ఇప్పట్లో ఈ నిధులు జమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

ఆందోళనలో విద్యార్థులు

ఏడాదికి నాలుగుసార్లు విద్యాదీవెన కింద డబ్బులను విడుదల చేస్తారు. గతేడాదికి సంబంధించి ఒక్క విడత ఫీజు మాత్రమే అందింది. అదీ చాలా మందికి రాలేదు. మిగిలిన మూడు విడదల ఫీజులు రావాల్సి ఉంది. ఫీజుల విడుదల విషయంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుండటంతో ఈ విద్యా సంవత్సరం కూడా దాదాపు ముగింపు దశకు చేరుకుంది. ఎన్నికల హడావుడిలో అందరూ ఉన్న దృష్ట్యా విద్యాదీవెన వస్తుందా.. రాదా అన్న అనుమానం విద్యార్థుల్లో నెలకొంది.

టీడీపీ హయాంలో కళాశాలల ఖాతాలకే

గత టీడీపీ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను నేరుగా కళాశాలలకే విడుదల చేసేవారు. దీనికోసం ప్రతిసారి రూ.కోట్లు ఖర్చుచేసి మీటింగులు పెట్టడం.. పేజీల కొద్దీ ప్రకటనలు ఇచ్చేవారు కాదు. ఒకవేళ ప్రభుత్వం నిధులు విడుదల చేయడం ఆలస్యమైనా సంబంధిత శాఖల అధికారులే నేరుగా కళాశాల నిర్వాహకులతో సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూసేవారు. ఫీజులు కట్టాలని ఒత్తిడి చేసే కళాశాలలకు ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీశాఖల అధికారులే ఫీజులకు ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని హామీ పత్రాన్ని ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తోంది. ఇప్పుడిలా డబ్బులు జమ కాకపోవడంతో సకాలంలో కళాశాలలకు కట్టలేని పరిస్థితి. దీంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. చదువు పూర్తయిన వారికి పెండింగ్ ఫీజులను చెల్లిస్తేనే సర్టిఫికెట్లను ఇస్తామని స్పష్టం చేస్తున్నాయి. కళాశాలల్లో చదువుతున్న వారికి ఫీజులు కడితేనే తరగతులకు అనుమతిస్తామంటున్నాయి. ఆర్థిక స్థోమత కలిగిన వారు ముందుగానే ఫీజులను కడుతుండగా పేదలు వడ్డీకి అప్పులు చేసి ఫీజు కడుతున్నారు.

దీనికేమీ అడ్డంకులు లేవు కదా

కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు చేసి వలంటీర్లను పక్కన పెట్టించింది. అందువల్ల సకాలంలో అవ్వా తాతలకు పింఛన్లను ఇవ్వలేకపోయామంటూ అధికార పార్టీ నేతలు ఏప్రిల్‌లో ప్రచారం చేశారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయించే ప్రత్యామ్నాయం ఉన్నప్పటికీ వృద్ధులను ఇబ్బంది పెట్టారు. మరి, విద్యాదీవెన నిధులకు వలంటీర్ల అవసరం లేదు కదా.నే...రుగా తల్లులు, పిల్లల జాయింట్ అకౌంట్‌లో ఆ డబ్బులు ఎందుకు జమ చేయలేదనే దానికి అధికార పార్టీ నేతల నుంచి సమాధానం లేదు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నమ్మి.. అప్పులపాలై..!

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తుందని నమ్మి నిరుపేదలైన తల్లిదండ్రులు తమ పిల్లలను పెద్ద చదువులకు చేర్పించారు. తీరా ప్రభుత్వం సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంతో అప్పులపాలయ్యారు.
- చిత్తూరులోని చాకలవీధికి చెందిన తరుణ్ నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతడి తండ్రి డ్రైవరు. కాలేజీ నిర్వాహకులు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేశారు. విద్యాదీవెన పథకం కింద డబ్బులు జమ కాలేదని చెప్పినా వారు వినిపించుకోలేదు. దాంతో అప్పులు చేసి కాలేజీ ఫీజులు చెల్లించారు. కుటుంబం గడవటమే కష్టంగా ఉన్న తమకు.. ఈ అప్పు భారంగా మారిందని తరుణ్ తండ్రి వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.
- యాదమరికి చెందిన సంజయ్ తిరుపతిలో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. గతేడాది ఫీజునే ప్రభుత్వం చెల్లించలేదు. కాలేజీ నిర్వాహకుల ఒత్తిడిమేరకు అప్పులు చేసి ఫీజులు కట్టారు. ఇప్పుడు తీసుకున్న వడ్డీలు కడుతున్నారు.

- చిత్తూరు

● 'పూజా'కాలం

దేవుళ్లకు మంచిరోజులు!

కొండకోనల్లో గమ్మున తమమానాన తాము ఉంటున్న దేవుళ్లకు మంచిరోజులు వచ్చేశాయి. గుళ్లూ గోపురాలు రాజకీయ జనాలతో కళకళలాడుతున్నాయి. మానవ ప్రయత్నంతో పాటు దైవ ప్రయత్నమూ తోడవ్వాలన్నది భారతీయ సంప్రదాయం. ఎంత కష్టపడినా ఫలితం అనుకూలంగా ఉండాలంటే దైవబలం తోడవ్వాలన్నది మనకున్న నమ్మకం. ఈ సంప్రయాలనూ, నమ్మకాలనూ తూచా తప్పకుండా పాటించేది రాజకీయాలలోనే. మరీ ఎన్నికలొచ్చాయంటే చాలు.. గుడులు, గోపురాలు తిరగడం, తమను లేదా తాము అభిమానించే నాయకుడిని గెలిపించాలని భక్తిగా దేవతలకు మొక్కడం రాజకీయ నాయకులకు ఆనవాయితీ. ఎన్నికలు పట్టుమని పదిరోజులు కూడా లేవిక. అందుకే హడావుడి తీవ్రమైపోయింది. ఒకవైపు ప్రచారాలను ఉధృతం చేస్తూనే, వీలు కల్పించుకుని ఆలయాలనూ సందర్శించేస్తున్నారు నాయకులు. కోరిన కోరిక తీరుస్తాడని స్థానికంగా నమ్మకం బాగా ఉన్న దేవతలను వెదకి మరీ, కొండకోనల్లో ఉన్నా సరే మండే ఎండలను లెక్క చేయకుండా నడిచే వెళ్లిపోతున్నారు. మనసారా మొక్కి 'విజయాన్ని అందించు సామీ' అని వేడుకుంటున్నారు. అలా టీడీపీ కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అనుచరగణంతో పైపాళ్యం పంచాయతీ కూసూరులో కొండ కోనల నడుమ కొలువైన సుబ్రహ్మణ్యస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. 'అధినేత చంద్రబాబు నాయుడును లక్ష ఓట్ల మెజారిటీతో అఖండ విజయాన్ని అందించు స్వామీ' అంటూ మొక్కుకున్నారు.

- కుప్పం



కూసూరు దేవాలయంలో సురేశ్‌బాబు పూజలు

రెండు రోజుల కిందట చంద్రమాకులపల్లె సచివాలయం వద్ద 'పార్టీ' సందడి



మందు 'పార్టీ'లు

పోలింగ్ తేది దగ్గరపడే కొద్దీ పుంగనూరులో మందు 'పార్టీలు' ఎక్కువవుతున్నాయి. దీనికోసం గ్రామ సచివాలయాన్నే వేదికగా మార్చేశారు కొందరు వైసీపీ నేతలు. రెండురోజుల కిందట పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె గ్రామంలో వైసీపీ నాయకులు ప్రచారం పూర్తి చేసుకున్నారు. ఆ రాత్రికి గ్రామసచివాలయం వద్దే ప్రచారంలో పాల్గొన్న వారికి మందు బాటిళ్లు, బిర్యాని ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈవిషయంపై టీడీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది కూడా. ఇక పార్టీ క్యాడర్‌కు ప్రతి రాత్రి మందు, విందే. ఇలా నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో మందు, విందు పార్టీలు జోరుగా సాగుతున్నాయి.

- పుంగనూరు

● నోట్ దిస్ పాయింట్



- ఓటరు గుర్తింపుకార్డును 1993లో అప్పటి ఎన్నికల ప్రధాన కమిషనరు టి.ఎన్.శేషన్ ప్రవేశ పెట్టారు. అక్కడ్నుంచి ఇప్పుడు ఎపిక్ ఓటరు కార్డుల వరకు వచ్చింది.
- 2011 జనవరి 25న మొట్టమొదటిసారిగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జనవరి 25న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.
- భారత ఎన్నికల కమిషన్ 1950 జనవరి 25న ఏర్పాటైంది. అప్పటినుంచి జిల్లాస్థాయిలో జిల్లా ముఖ్య ఎన్నికల అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తున్నారు.


- చిత్తూరు కలెక్టరేట్

చిత్తూరు పార్లమెంటు చరిత్ర

టీడీపీ కంచుకోట

తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక చిత్తూరు పార్లమెంటుకు 10 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఏడు సార్లు టీడీపీ గెలిచింది. చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం అసెంబ్లీ స్థానంలో అత్యధికంగా మెజార్టీ వస్తుండడం.. చిత్తూరు లోక్‌సభలో టీడీపీ అభ్యర్థి విజయానికి కలిసొచ్చే అవకాశం. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ఈ స్థానం ఎస్సీలకు రిజర్వు అయింది. చిత్తూరు తొలి ఎంపీగా 1952-57 మధ్యకాలంలో టీఎన్ విశ్వనాథరెడ్డి కాంగ్రెస్ నుంచి గెలిచారు. ఎస్సీలకు రిజర్వు అయ్యాక తొలిసారి 2009లో టీడీపీ నుంచి నటుడు, దర్శకుడు ఎన్.శివప్రసాద్ ఎంపీగా గెలుపొందారు.

పదవీ కాలం	ఎంపీ పేరు	పార్టీ
1952-57	టీఎన్ విశ్వనాథరెడ్డి	కాంగ్రెస్
1957-62	ఎంఏ అయ్యంగార్	కాంగ్రెస్
1962-67	ఎన్‌జీ రంగా	స్వతంత్ర పార్టీ
1967-71	ఎన్‌పీసీ నాయుడు	కాంగ్రెస్
1971-77	పి.నరసింహారెడ్డి	కాంగ్రెస్
1977-80	పి.రాజగోపాలనాయుడు	కాంగ్రెస్
1980-84	పి.రాజగోపాలనాయుడు	కాంగ్రెస్
1984-89	ఎన్‌పీ ఝాన్సీలక్ష్మి	టీడీపీ
1989-91	జ్ఞానేంద్రరెడ్డి	కాంగ్రెస్
1991-96	జ్ఞానేంద్రరెడ్డి	కాంగ్రెస్
1996-98	రామకృష్ణారెడ్డి	టీడీపీ
1998-99	రామకృష్ణారెడ్డి	టీడీపీ
1999-2004	రామకృష్ణారెడ్డి	టీడీపీ
2004-09	డీకే ఆదికేశవులు	టీడీపీ
2009-14	శివప్రసాద్	టీడీపీ
2014-19	శివప్రసాద్	టీడీపీ
2019-24	ఎన్ రెడ్డెప్ప	వైసీపీ



విశేషాలు

- గుంటూరు జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు నాయకుడు ఆచార్య ఎన్జీ రంగాను చిత్తూరు లోక్‌సభ ప్రజలు ఎంపీగా గెలిపించి పార్లమెంటుకు పంపించారు. నెహ్రూ విధానాలను వ్యతిరేకించి కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన ఆయన స్వతంత్ర పార్టీని స్థాపించి 1962 ఎన్నికల్లో చిత్తూరు ఎంపీగా పోటీ చేసి గెలిచారు.
- నూతనకాల్వ రామకృష్ణారెడ్డి 1996, 98, 99 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి మూడుసార్లు గెలుపొందారు. హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంది ఈయన ఒక్కరే. ఈయన మాజీ మంత్రి అమరనాథరెడ్డి తండ్రి.

అసెంబ్లీ నియోజక వర్గాలు

కుప్పం, పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి, చంద్రగిరి

- చంద్రగిరి పూర్తిగా, నగరి సెగ్మెంట్‌లోని పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాలో ఉన్నాయి.
- చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం రాజంపేట పార్లమెంటు పరిధిలో ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య.

మదనపల్లి అర్బన్ మే 3 : ఆర్థిక ఇబ్బందులతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్నట్లు మదనపలి సీఐ శేఖర్ తెలిపారు. మదనపలి మండలం వేంపల్లి పంచాయతీ కస్పాకు చెందిన బయన్న గారి సతీష్(49) శుక్రవారం ఉదయం ఇంట్లో తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు . ఇతను బెంగళూరులో ప్రైవేట్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారని, ఐతే షేర్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఈఎంఐ కట్టలేక బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 1న బెంగళూరు నుంచి మదనపలి మండలం వేంపల్లికి వచ్చి, ఆర్థిక ఇబ్బందుల గురించి తల్లిదండ్రులకు తెలియజేశారు. తండ్రి వ్యవసాయదారి కావడంతో కుటుంబ సభ్యులకు ఇబ్బందులు, సమస్యలు తీర్చలేమని తేల్చి చెప్పడంతో శుక్రవారం ఉదయం ఎవరూ లేని సమయం చూసి ఇంట్లో తాడుతో ఫైపుకు ఉరేసుకున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా అప్పటికే అతను మృతి చెందడంతో మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మదనపలి రూరల్ సీఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు .

ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం విక్రయాలు నిర్వహించాలి


దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఈఎస్

కురబలకోట, మే 3: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం విక్రయాలు నిర్వహించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినయ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం కురబలకోట మండలం అంగళ్ళు, ముదివేడులలో ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా అయన మా ట్లాడుతూ మద్యం స్టాకు రికార్డులను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఎన్నికలు జరగనున్న సమ స్యాత్మాక ప్రాంతాలలో సెన్సిటీవ్ మద్యం దుకాణాలు ఉన్నందున ఎటువంటి అవకతవకలు జరగకుండా తని ఖీలు చేపట్టామన్నారు. కాగా దుకాణాలలో నిబంధన లకు లోబడి విక్రయాలు జరపాలని అలా కాకుండా విక్రయాలు జరిపితే చట్ట ప్రకారం చర్యలు చేపట్టను న్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలలో సీఐ జయనరసింహా తదితరులు పాల్గొన్నారు.

అరాచకాల అడ్డుకట్టకే కూటమి ఏర్పాటు


కలకడ సమావేశంలో మాట్లాడుతున్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

కలకడ, మే 3:రాష్ట్రంలో వైసీపీ అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకే బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఏర్పడిందని రాజంపేట పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పీలేరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డితో కలిసి కలకడ టీడీపీ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. తాను సీఎం రాజీనామా చేసిన నాటికి రాష్ట్రానికి 90 వేల కోట్ల నుంచి 92 వేల కోట్లు అప్పులున్నాయన్నారు. జగన్ పాలనలో ఈ అప్పులు రూ.8 లక్షల కోట్లుకు చేరుకోవడం బాధాకరమన్నారు. ఇక ఆ పార్టీ నాయకులు రాజకీయ వ్యాపారం చేస్తూ ప్రకృతి సంపదైన ఇసుక, భూములు, ఖనిజాలను దోచుకున్నారని విమర్శించారు. హంద్రీ-నీవా ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 1.40 లక్షల ఏకరాలకు సాగు నీరు ఇచ్చే విధంగా అప్పటిలో రూపకల్పన చేసి అందులో పీలేరు నియోజకవర్గంలోనే 76 వేల ఎకరాలకు సాగు వస్తుందన్నారు. తన హయాంలో 2011-12 సంవత్సరాల్లో అనంతపురం జిల్లా జీడిపల్లె వరకు రైతులకు సాగు నీరు అందిచినట్లు తెలిపారు. కేవలం 200 అడుగుల లిఫ్టు ద్వారా ఇక్కడకి నీరు పుష్కలంగా వస్తాయన్నారు. ఆ పనులు చేపట్టిన పెద్దిరెడ్డి కంపెనీ నిర్వాహంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని మండిపడ్డారు. అదే విధంగా ఆ పార్టీ నాయకులు తమ వ్యాపార లాభం కోసం, పాడి, మామిడి రైతుల పొట్టకొట్టి లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. పుంగనూరు నియోజకవర్గంలో ఎన్నికల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం ప్రతి పోలింగ్ బూత్‌లో వెబ్ కెమెరాలను ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. చంద్రబాబునాయుడు సీఎం పదవి చేపట్టిన వెంటనే మైనారిటీలకు అమలు చేసే పథకాలను వివరించి వైసీపీ నాయకుల విష ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. ఈ నెల 8వ తేదీన పీలేరు నియోజకవర్గంలోని కలికిరిలో జరిగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ హాజరై సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై విజయ వంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు నల్లారి నిఖిలేష్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, జనసేన కన్వీనర్ దినేష్, వెంకట్రామయ్య చౌదరి, వంగిమళ్ల మధుసూదన్‌రెడ్డి, మల్లారపు రవిప్రకాశ్, సూర్యప్ర కాశ్, రఘురామిరెడ్డి, ప్రభాకర్‌నాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, తిరుపతినాయుడు, కాంతారావు, చంద్రమోహన్, విశ్వనాథ్, పీవీ నాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ లో చేరిన పెద్దమండ్యం మండల వాసులు

పెద్దమండ్యం, మే 3: మాజీ సీఎం, రాజంపేట బీజేపీ ఎంపీ కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పెద్దమండ్యం మండల వాసులు శుక్రవారం బీజేపీలో చేరారు. కలికిరి బీజేపీ కార్యాలయంలో పెద్దమండ్యం మండలం కలిచెర్ల పరిధిలోని తాటిమాకులపల్లి కు చెందిన ప్రభాకరరెడ్డి, రామకృష్ణరెడ్డి, నాగమునిరెడ్డి మిట్టవాండ్లపల్లి కు చెందిన జయరాం లకు బీజేపీ కండవాలు వేసి కిరణ్‌కుమార్‌రెడ్డి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులు కిరణ్‌కుమారెడ్డి, జయచంద్రారెడ్డిల గెలుపు కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

వేసవి సెలవుల్లో ఊటీకి ప్రత్యేక సర్వీసు

మదనపల్లె అర్బన్, మే 3: మదనపల్లె నుంచి ఊటీకి ప్రత్యేక సర్వీసు నడుపుతున్నట్లు వన్‌డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈనెల 7వ తేదీ రాత్రి 8 గంటలకు మదనపల్లెలో బయలుదేరి 8వ తేదీ ఉదయం ఊటీకి చేరుకుంటుందన్నారు. కాగా 9వ తేదీ ఉదయం ఊటీలో బయలుదేరి కున్నూర్ హిల్స్ స్టేషన్ మైసూర్ చూసుకుని 10వతేదీ మదనపల్లెకు బస్సు చేరుతుందని పేర్కొన్నారు. ఒక టికెట్ కేవలం రూ. 2800 అన్నారు. అవసరమైన వారు ఈ ఫోన్‌నెంబర్లకు 9346772487, 9441152934కు సంప్రదించాలని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోండి

తంబళ్లపల్లె, మే 3: పోలింగ్ విధులు, ఎన్నికలకు సంబంధించిన విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ఫెసిలిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆర్వో రాఘవేంద్ర తెలిపారు. తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదు చేసుకున్న పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు కురబలకోట మండలం అంగళ్లు జిల్లా పరిషత్ హైస్కూలులో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5, 6 తేదీలలో టీము నెం.1 నుంచి టీము నెం.7లోని ఎన్నికల విధుల్లో పాల్గొను పీవో, ఏపీవో, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్, ఇతర ఎన్నికల సిబ్బంది, 6వ తేదీన టీము నెంబరు-8లో ఫారం-12డి సమర్పించిన అత్యవసర సర్వీసులకు సంబంధించిన ఉద్యోగులు, పోలీసు సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు.

పీలేరులో ప్రారంభమైన 'హోం ఓటింగ్'


ఓటు వినియోగించుకుంటున్న వృద్ధురాలు

పీలేరు, మే 3: ప్రత్యేక ప్రతిభావంతులు, 85 ఏళ్ల దాటిన వయో వృద్ధుల కోసం ఎన్నికల సంఘం ప్రారంభించిన 'హోం ఓటింగ్' శుక్రవారం పీలేరు నియోజకర్గంలో ప్రారంభమైంది. హోం ఓటింగ్ కోసం నియోజకవర్గంలో 155 మం ది దరఖాస్తు చేసుకోగా తొలిరోజు అయిన శుక్రవారం 61 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హోం ఓటింగ్ కోసం పీలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి ఫర్మాన్ అహ్మద్ ప్రత్యేకంగా నియ మించిన ప్రత్యేక బృందాలు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల మేరకు ఓటింగ్ నిర్వహించారు. పీలేరు మండలంలో 11 మంది, కేవీపల్లెలో 10, కలికిరిలో 10, గుర్రంకొండలో 12, కలకడలో 9, వాల్మీ కిపురంలో 9 మంది ఓటు వేసినట్లు ఈఆర్‌వో మహబూబ్ బాషా తెలిపారు.

స్మార్ట్ బైక్ తయారు చేసిన ఇంజినీరింగ్ విద్యార్థులు



మదనపల్లె టౌన్, మే 3: మదనపల్లెలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు విద్యుత్‌శక్తితో నడిచే స్మార్ట్‌బైక్‌ను తయారు చేసి ఆవిష్కరించారు. శుక్రవారం కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ ఫైనలియర్ విద్యార్థులు రూపొందించిన స్మార్ట్‌బైక్‌లో ఆటోమేటిక్ గేరింగ్ సిస్టం, బ్లూటూత్, జీపీఎస్ ట్రాకింగ్‌తో పాటు 4గంటల చార్జింగ్‌తో 80 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయవచ్చన్నారు. విద్యార్థులు కొత్త టెక్నాలజీతో మరిన్ని ప్రయోగాలు, ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్ బాబు, ప్రాజెక్టు గైడ్ ప్రవీణ, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీటిని పరిరక్షించుకోవాలి

కురబలకోట, మే 3: నీటిని పరిరక్షించుకోవాలని లేకుంటే మానవాళి మనుగడ ప్రశ్నార్థకమే అవుతుందని జలవనరులశాఖ సూపరింటెండెంట్ రాజగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నీటా-2కె24 జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మ్లాడుతూ నీటిని వృథా చేస్తే భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. భూగర్భజలాల పెంపు నీటి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల నిర్వహించిన పలు ప్రాజెక్టులు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ కమాల్ బాషా, కో ఆర్డినేటర్ లిప్సమిశ్ర,సుధీర్‌కుమర్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎంఎస్ యాప్‌లో నివేదికలు పంపండి

మదనపల్లె టౌన్, మే 3: ఎన్నికల సమయంలో ప్రిసైడింగ్ అధికారులు(పీవో) పీడీఎంఎస్ యాప్‌లో ఎప్పటికప్పుడు ఎన్నికల ఓటింగ్ సరళి, తదితర అంశాలను అప్‌డేట్ చేయాలని అసెంబ్లీ లెవెల్ మాస్టర్‌ట్రైనీస్(ఏఎల్ఎంపీ)లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎన్నికల విధులు కేటాయించిన పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సామగ్రి పంపిణీ నుంచి పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లడం, అక్కడ మాక్ పోలింగ్, పోలింగ్, ఎన్నికల సరళి తదితర అంశాలపై పీడీఎంఎస్ మొబైల్‌యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్నికల సమయం అరగంట ముందు రాజకీయ పార్టీల ఏజెంట్ల ఎదుట మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. ఏజెంట్ల ఎదుట యాభై ఓట్లతో ఓటింగ్ నిర్వహించి, వేసిన ఓట్లు, వచ్చిన ఓట్ల సంఖ్య వివరించాలన్నారు. దీంతో పాటు ఓటింగ్ సమయంలో వీవీప్యాట్‌లో వచ్చే స్లిప్పులను చూపించి పోలైన ఓట్ల సంఖ్య సరిపోయాయో లేదో ఏజెంట్లకు వివరించాలన్నారు. పోలింగ్ మధ్యలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు మరమ్మతుకు గురైతే వాటిని ఎలా మార్చాలి, ఎక్కడైతే పోలింగ్ నిలిచిపోయిందో అక్కడి నుంచే పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏజెంట్లకు 17 సీ ఫారమ్‌లు ఇవ్వడం, ఓటర్ల వివరాలు, ఓపీవోలకు ఏ విధులు కేటాయించాలో వివరించారు. 12 మంది ఏఎల్ఎంపీలు శిక్షణ ఇచ్చారు. కాగా తొలిరోజు 312 మంది పీవో, ఏపీవోలకు గాను 299 మంది హాజరయ్యారు.

ఆదరించండి .. అభివృద్ధి చేస్తా

మదనపల్లె అర్బన్, మే 3: ఆదరించండి అభివృద్ధి చేసి చూపుతానంటూ శుక్రవారం స్థానిక ఆర్యవైశ్యహాస్టల్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో మాజీ సీఎం, రాజంపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి నల్లారికిరణ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు అండగా ఉంటామని, అన్నివిధాల ఆదుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐదేళ్ల పాలనలో దోపిడీ, దౌర్జన్యం, మాఫియా, భూకబ్జాలు పాలకులు నడిపారని ధ్వజమెత్తారు. మదనపల్లెకు జిల్లా రాకుండా అడ్డుకున్నది వైసీపీ నాయకులు స్వార్థం కాదా అని ప్రశ్నించారు. ఆర్యవైశ్యులు గత పాలనను దృష్టిలో పెట్టుకుని రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి అయిన తనకు కమలం గుర్తుపైనా, మదనపల్లె అసెంబ్లీ కూటమి అభ్యర్థి ఎం. షాజహాన్ బాషాకు సైకిల్ గుర్తుపైనా ఓట్లు వేసి వేయించి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మాజీ ఎమ్మెల్యే మదనపల్లె అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా మాట్లాడారు. కార్యక్రమంలో మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్, యువజన అధ్యక్షుడు ఎల్లంపల్లి ప్రశాంత్, బీజేపీ నాయకులు చల్లపల్లె నరసంహారెడ్డి, సురేష్‌రెడ్డి, ఆకులకృష్ణమూర్తి, బర్నేపల్లె రవికుమార్, జేకే వర్మ, తెలుగుయువత రాష్ట్రఅధ్యక్షుడు శ్రీరాంచినబాబు, రాటకొండబాబురెడ్డి, మధుబాబు, రామకృష్ణ, జనసేన నాయకులు రాందాస్ చౌదరి, జంగాలపల్లె శివరాం, తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ పాపం పాలకులదే..

నిమ్మనపల్లి, మే 3: ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ పాపం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాచవేటివారిపల్లి గ్రామపంచాయతిలో ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ. బీజేపీ ప్రభుత్వాలు రెండూ కలిసే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ చట్టాన్ని తెచ్చాయన్నారు. దీని వలన రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. భూమికి సంబంధించి ఒరిజినల్‌ను యజమానికి ఇవ్వకుండా కేవలం జిరాక్స్ పత్రాలు మాత్రమే ఇచ్చి రైతును మోసం చేస్తుందని తెలిపారు. ఒరిజినల్స్‌ను తాకట్టు పెట్టుపెట్టుకొనేందకే ఈ ప్రభుత్వాలు పన్నాగం పన్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే పలు ప్రభుత్వ కార్యాలయాలను తాకట్టు పెట్టన ఘనత వైసీపీదే అని ధ్వజమెత్తారు. ఈ చట్టాన్ని రద్దు పరచాలంటే ఉమ్మడి కమ్యూనిస్ట్ పార్టీ కాంగ్రెస్ అభ్యరి పవన్‌కుమార్‌ను గెలించాలని కోరారు.

పింఛన్ల కోసం ఎదురుచూపు..


వాల్మీకిపురంలో గ్రామీణ బ్యాంకు గేట్ వద్ద వృద్ధుల పడిగాపులు

వాల్మీకిపురం, మే 3: వాల్మీకిపురం పట్టణంలో శుక్రవారం ఉదయం వృద్ధులు, దివ్యాంగులు తెల్లవారక ముందే పింఛన్ డబ్బుల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. స్థానిక బ్యాంకులు, గ్రామ సచివాలయాలు తెరవకమునుపే ఉదయం 8గంటల సమయానికే వృద్ధులు, దివ్యాంగులు చేరుకుని పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూశారు. ఈసందర్భంగా కొందరు వృద్ధులు మాట్లాడుతూ రెండురోజులుగా సచివాలయం, బ్యాంకుల వద్దకు వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్నామని తమలాంటి నిరుపేదలను గుర్తించి అధికారులు పింఛన్ డబ్బులను ఇళ్లవద్దనే పంపిణీ చేయాలని కోరుతున్నారు.

సమయపాలనతో ఆధిక ఆదాయం

మదనపల్లె అర్బన్, మే3: సమయపాలనతో అధిక ఆదాయం సాధ్యమౌతుందని మదనపల్లె వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డిపోలో గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ మాసంలో వన్ డిపో ఆదాయం రూ. 567,33 లక్షలు సాధించిందన్నారు. అలాగే ఈపీకే 44.15, ఓఆర్ 82 శాతం, కేఎంపీఎల్ 5.50 సాధించి రీజియన్‌లోనే మొదటి స్థానంలో నిలిచామన్నారు. ఇందులకు సహకరించిన ఆర్టీసీ ఉద్యోగులను ఆయన అభినందించారు. అందరూ ఇష్టంతో పనిచేసి ఇదే ఒరవడిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నాయని అందరూ తగిన నీళ్లు, మజ్జిగ వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.

కలకడలో వైసీపీకి షాక్.. కూటమిలోకి సీనియర్ నేత


వేదికపై నల్లారి సోదరులతో మధుసూదన్‌రెడ్డి

కలకడ, మే 3: కలకడ మండలంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీ, మండల వ్యాప్తంగా అనుచర గణం, అభిమానులు ఉన్న వంగిమళ్ల మధుసూదన్‌రెడ్డి శుక్రవారం వైసీపీని వీడి ఎన్డీయే గూటికి చేరారు. తనతోపాటు ఎర్రకోటపల్లె కుర్రా లక్ష్మీదేవి, ఎంపీటీసీ బీబీజాన్‌తో పాటు 500 కుటుంబాలను ఆయన ఎన్డీయే గూటికి చేర్చారు. అందులో 100 మైనారిటీ కుటుంబాలు ఉండడం విశేషం. పాపిరెడ్డిగారిపల్లెలో శుక్రవారం రాజంపేట పార్ల మెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వారం దరికీ కూటమి కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నల్లారి సోదరులు మాట్లాడుతూ ప్రజలు తమపై నమ్మకంతో కలిసి అడుగు లు వేయాలనుకోవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో నల్లారి నిఖిలేష్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, మల్లారపు రవిప్రకాశ్, మద్దిపట్ల సూర్యప్రకాశ్, బరకం శ్రీనివాసులరెడ్డి, వంగిమళ్ల వెంకటకుమార్‌రెడ్డి, వంగిమళ్ల శ్రీనివాసు లరెడ్డి, పి.రఘురామిరెడ్డి, ప్రభాకర్‌నాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, వెంకటరమణనాయుడు, కోట రమణ నాయుడు పాల్గొన్నారు.

అక్రమార్జన ఆపితే..సంక్షేమ పథకాలు అమలుచేయవచ్చు


బి.కొత్తకోటలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్

బి.కొత్తకోట, మే3: జగన్ ప్రభుత్వం చేస్తున్న అక్రమార్జన, దోపిడీకి అడ్డుకట్ట వేస్తే...తద్వారా మిగిలే నిధులతో అన్ని సంక్షేమ పథకాలూ అమలు చేయవచ్చునని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ పేర్కొన్నారు. శుక్రవారం బి.కొత్తకోటలోని స్వగృహంలో ఆమె విలేఖరులతో మాట్లాడారు. చంద్రబాబు-పవన్ కళ్యాణ్‌లు జనరంజక మేనిఫెస్టోను రూపొందించారని, అవినీతిని అరికట్టి రాష్ట్రప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకుంటే కూటమి మేనిఫెస్టోలోని హామీలు అమలు చేయడం కష్టమేమీ కాదని ఆమె అన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో 8లక్షల కోట్ల అవినీతి జరిగిందన్నారు. మద్యం మాఫియానే ఇందుకు ఉదాహరణ అన్నారు. ముస్లిం మైనారిటీల కోసం 50 ఏళ్లకే రూ.4000పింఛన్, హజ్‌హౌస్ నిర్మాణం, ఈద్గాలు, ఖబరస్తాన్‌లకు స్థలాలు, మైనారిటీ కార్పొరేషన్ రుణాలు, 4శాతం రిజర్వేషన్‌లకు చట్టబద్ధత కల్పించడం లాంటి ఎన్నో హామీలతో కూటమి మేనిఫెస్టో ప్రజల ముందు నిలిచిందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కిట్టన్న, ప్రభాకర, పద్మనాభ, రవికుమార్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె జిల్లా కేంద్రానికి అన్ని అర్హతలున్నాయి

● చర్చాగోష్టిలో మేధావుల సూచన


మదనపల్లె జిల్లా ఏర్పాటు చర్చావేదికలో మాట్లాడుతున్న విద్యావేత్త గురుప్రసాద్

మదనపల్లె టౌన్, మే 3: మదనపల్లె కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయని పలురంగాలకు చెందిన మేధావులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రైవేటు కళ్యాణమండపంలో బీటీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.తులసీరామ్ నాయుడు ఆధ్వర్యంలో మదనపల్లె జిల్లా చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యావేత్త రాటకొండ గురుప్రసాద్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి దేశంలోనే అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా పాలన అందించిన మదనపల్లెలో జిల్లా కేంద్రాని కావాల్సిన అన్ని వసతులు, సదుపాయాలు వున్నాయన్నారు. 200 ఏళ్లకుపైగా చరిత్ర వున్న మదనపల్లెలో ప్రతిష్టాత్మక జిడ్డు కృష్ణమూర్తి నెలకొల్పిన రిషివ్యాలీ, టీబీ చికిత్సకు ఆరోగ్యవరం మెడికల్ సెంటర్, ఆంధ్ర ఊటి హార్సిలీహిల్స్, లక్షలాదిమందికి విద్యాబుద్ధులు నేర్పిన బీటీ కళాశాల ఉన్నాయన్నారు. పలువురు మేధావులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జిల్లా సాధనకు జరగబోయే ఎన్నికలలో సరైన నిర్ణయం తీసుకుంటేనే మదనపల్లె కేంద్రంగా జిల్లా వస్తుందన్నారు. టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మధుబాబు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం మదనపల్లె నిర్వహించిన మినిమహానాడులో చంద్రబాబు హామీ ఇచ్చారని, మదనపల్లె, పుంగనూరు, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలతో కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామని, యువగళంలో లోకేశ్ కూడా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంగో గంగారపు గౌతమ్‌రెడ్డి, నాదెళ్ల విద్యాసాగర్, పెరవలి నవీన్, నిరంజన్‌నాని, రాటకొండ రాజేశ్, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి

నిమ్మనపల్లి, మే 3: ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కూటమి నేతలు పేర్కొన్నారు. శుక్రవారం నిమ్మనపల్లి పంచాయతి గంగాపురంపల్లి, పెద్దరాజులపల్లిలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్ బాషా, కూటమి పార్లమెంట్ అభ్యర్థి కిరణ్‌కుమారెడ్డిలను గెలించాలని వారు ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ బీసీలకు 50ఏళ్లకే పింఛన్‌ను ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, రాజంపేటఅధికార ప్రతినిధి ఆర్జీవెంకటేష్, మాజీ ఎంపీపీ రెడ్డెప్పరెడ్డి, , బీసీ అధికార ప్రతినిధి లక్ష్మన్న, సర్పంచ్ రెడ్డెప్ప, మాజీ ఎంపీపీ రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు రాజన్న, రమణ, మల్లప్ప, మహమ్మద్‌రఫి, శ్రీరాములు, మల్లికార్జున, నాయకులు మురళి, కేశవ, గోపాలక్రిష్ణ, చంద్రసింగ్, సోము, శ్రీనివాసులు, నరసింహులు, శ్రీపతి, సుధాకర్, సహదేవ, జగదీష్, రెడ్డెప్ప, జయన్న, చినబాబు, చెంద్రాయుడు, ఖాసింఖాన్, బాబు, చంద్ర, జనసేన నాయకులు ప్రదీప్, చంద్రశేఖర్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యం

నిమ్మనపల్లి, మే 3: రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆపార్టీ మదనపల్లె అభ్యర్థి మల్లెల పవన్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండు లోని అంబేద్కర్ విగ్రహాని పూలమాలలు వేసి ఇంటింట ప్రచారం చేపట్టారు. మే13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకొవాలన్నారు. నాగేంద్ర, ముబారక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి పలువురు చేరిక

మదనపల్లె అర్బన్, మే3: స్థానిక జగన్ కాలనీనుంచి అధిక సంఖ్యలో యువత, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మదనపల్లె మండలం, కోళ్లబైలులోని జగన్‌కాలనీలో యువత,మహిళలు అధికసంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి, రెడ్డి, మాధవ్, శ్రీను, పార్టీ నాయకులు మల్లెల నరేంద్రరెడ్డి, సురేంద్రరెడ్డి, సలీం, షాహిన్, ముబారక్, పాల్గొన్నారు.

ములకలచెరువులో: ములకలచెరువులో శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రచారం చేపట్టారు. స్థానిక పీటీఎం రోడ్డు, వారపు సంతలో ప్రచారం చేపట్టి ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

7న ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

తంబళ్లపల్లె, మే 3: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 7వ తేదీ నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు తిరుపతి, బెంగళూరు, హైదరాబాదు నుంచి ప్రముఖ కంపెనీలు హాజరవుతాయన్నారు. పదోతరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లమా, డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వారి వారి విద్యార్హత ధృవపత్రాలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో బయోడేటా తీసుకురావాలని కోరారు. అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదరించండి తంబళ్లపల్లెను అభివృద్ధి చేస్తా..


పీటీఎంలో ప్రచారం నిర్వహిస్తున్న జయచంద్రారెడ్డి


బి.కొత్తకోట ప్రచారంలో కల్పనారెడ్డి

పెద్దతిప్పసముద్రం/ములకలచెరువు, మే 3:ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజవర్గంలో తనను ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని తంబళ్లపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి ప్రజలను అభ్యర్థించారు. శుక్రవారం ఆయన పీటీఎం మండలంలోని రాపూరివాండ్లపల్లె గ్రామంలోని కాయలవాండ్లపల్లె, నాగన్నకోట, క్రిష్టాపురం, ఉప్పరోళ్లపల్లె, కొత్తపల్లె డి. నారాయణ పల్లెల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. పీటీఎంలో కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డిని గెలిపించాలని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్(చిన్నా), సీనియర్ బీజేపీ నాయకులు సిమెంట్ శీనా, పాలగిరి రామాం జులు, రాము, రాఘవ, సప్పి రాజు, సాయి, కరెంట్ చంద్ర, రెడ్డెప్ప, రామచంద్ర, ఆదినారాయణ, వెంకట్రమణ, షఫి, మస్తాన్, మహేష్ పాల్గొన్నారు. ములకలచెరువులో టీడీపీ మండల అధ్యక్షు డు పాలగిరి సిద్ధా అధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. బురకాయలకోటలో రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, మౌళా, విజయ్‌కుమార్, రమణ, మురళీస్వామి, బీజేపీ నేత గోపాల్‌రెడ్డి ప్రచారం చేశారు.

బి.కొత్తకోటలో: ఎన్నికల్లో తంబళ్లపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ జయచంద్రారెడ్డి సతీమణి కల్పనారెడ్డి మండలంలోని మొటుకుపల్లి, చిన్నపల్లి, నాయనబావి గ్రామాలలో ఇంటింటి ప్రచారం చేశారు. కాగా బికొత్తకోటకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు దేవరాజుపల్లె, ఎస్సీకాలనీ, రెడ్డివారిపల్లె ఎస్సీకాలనీ గట్టు గ్రామాలలో ఇంటింటి ప్రచారం చేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి చౌడప్ప మాదిగ, కో ఇన్‌చార్జి ఏవీ రమణ మాదిగ, నాయకులు దేవరాజుపల్లె శంకర మాదిగ, పెయింట్ బాలు మాదిగ పాల్గొన్నారు.